# నీలగిరి ఎక్స్‌ప్రెస్

తెలుగు దిన పత్రిక

సంచిక : 326 | సంపుటి : 2 | తెలంగాణ ఆంధ్రప్రదేశ్ | గురువారం | 9-1-2025 | వెల : .రూ. 5.00



## విలేకరులు కావలెను

తెలంగాణ & ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్రాలలో (నీలగిరి ఎక్స్ ప్రెస్):
& చైతన్య గళం ఛానల్ లో పని చేయుటకు
- బ్యూరో ఇన్చార్జ్ లు
- జిల్లా స్టాఫ్ రిపోర్టర్ లు
- RC ఇన్చార్జ్ లు
- మండల రిపోర్టర్ లు
- క్రైమ్ రిపోర్టర్ లు

-జిల్లాల వారిగా ఆడ్ ఇన్చార్జ్ లు కావలెను. వివరాలకు మా WHATS APP నంబర్:- 9705770909 సంప్రదించండి.



# చంద్రబాబు లక్ష్యాలకు అండగా ఉంటా



- భుజంభుజం కలిపి అభివృద్ధి కోసం నడుస్తా
- ప్రజల ఆశలు,ఆశయాల సాధనకు మద్దతు ఇస్తా
- రూ.2.08 లక్షల కోట్ల విలువైన ప్రాజెక్టులకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు
- 2047 నాటికి 2.5 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థ లక్ష్యం
- విశాఖపట్టణం బహిరంగ సభలో ప్రధాని మోడీ వెల్లడి

విశాఖపట్నం,జనవరి 8(నీలగిరి ఎక్స్ ప్రెస్)
ముఖ్యమంత్రి చంద్రబాబు పెట్టుకున్న లక్ష్యాలకు తాము ఎప్పుడూ అండగా ఉంటామని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ భరోసా ఇచ్చారు. -మిగతా 2 లో





## గ్రూప్-3 ప్రిలిమనరీ కీ విడుదల

- 12 వరకు అభ్యంతరాల స్వీకరణ
- మే 1 నుంచి కొత్త ఉద్యోగాలకు నోటిఫికేషన్లు
- టీజీపీఎస్సీ ఛైర్మన్ బుర్రా వెంకటేశం వెల్లడి

హైదరాబాద్,
రాష్ట్రంలో 1,365 ఉద్యోగ ఖాళీలకు నిర్వహించిన గ్రూప్ -3 పరీక్ష ప్రిలిమినరీ కీని టీజీపీఎస్సీ విడుదల చేసింది. రాష్ట్రవ్యాప్తంగా 1,401 కేంద్రాల్లో గతేడాది నవంబర్ 17, 18 తేదీల్లో ఈ పరీక్షలు నిర్వహించిన విషయం తెలిసిందే. మొత్తం మూడు పేపర్లుగా నిర్వహించిన ఈ పరీక్షలకు రాష్ట్ర వ్యాప్తంగా 5.36లక్షల మంది దరఖాస్తు -మిగతా 2 లో

# కేసులు అసలు సమస్యే కాదు



- ఫార్ములా కేసులో పైసా అవినీతి లేదు
- న్యాయం కోసం సుప్రీంలో నేను కొట్లాడుతా
- రైతు, ప్రజా సమస్యలపై పార్టీ శ్రేణులు కొట్లాడాలి
- బిఆర్ఎస్ డైరీ ఆవిష్కరణలో కెటిఆర్ పిలుపు

హైదరాబాద్, జనవరి 8(నీలగిరి ఎక్స్ ప్రెస్)
కేసులు అసలు సమస్యే కాదు. రైతు భరోసా విషయంలో సీఎం రేవంత్ రెడ్డి ప్రభుత్వం చేస్తున్న మోసాన్ని ప్రజలకు వివరంగా చెప్పాలి. ఈ కేసుపై నేను పోరాడతాను. భారాస నేతలు కేసు గురించి ఆందోళన చెందాల్సిన అవసరం లేదు. నేను తప్పు చేయలేదు.. ఎవరికీ భయపడను' అని పార్టీ కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ అన్నారు. తెలంగాణ భవన్‌లో భారాస డైరీని ఆ కేటీఆర్ ఆవిష్కరించారు. ఈ కార్యక్రమానికి పార్టీ ఎమ్మెల్యేలు, మాజీ మంత్రులు, ఎమ్మెల్సీలు, నేతలు హాజరయ్యారు. అనంతరం పార్టీ నేతలను ఉద్దేశించి కేటీఆర్ మాట్లాడారు. ఫార్ములా ఈరేసు కేసు గురించి నేను చూసుకుంటాను. ఏసీబీ కేసు -మిగతా 2 లో



## ఆప్‌కు మద్దతు పలికిన మమతా బెనర్జీ

- హ్యాట్రిక్ విజయం కోసం ఆప్ కృషి
- ఎక్స్ వేదికగా కృతజ్ఞతలు తెలిపిన కేజ్రీవాల్

న్యూఢిల్లీ,
ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికల్లో హ్యాట్రిక్ విజయం కోసం తీవ్రంగా శ్రమిస్తోన్న ఆమ్ ఆద్మీ పార్టీకి తృణమూల్ కాంగ్రెస్ మద్దతు ప్రకటించింది. ఫిబ్రవరి 5న జరగనున్న అసెంబ్లీ ఎన్నికలకు బెంగాల్ సీఎం మమతా బెనర్జీ మద్దతు ప్రకటించినట్లు ఆప్ జాతీయ కన్వీనర్, ఢిల్లీ మాజీ సీఎం అరవింద్ -మిగతా 2 లో



## భారత భూభాగం ఆక్రమణ

బంగ్లా కథనాలను తిప్పికొట్టిన బిఎస్ఎఫ్

న్యూఢిల్లీ
భారత్‌లో 5 కిలోమీటర్ల మేరకు భూభాగాన్ని బంగ్లాదేశ్ సైన్యం ఆక్రమించుకొందన్న మీడియా కథనాలను సరిహద్దు భద్రతా దళం బీఎస్ఎఫ్ ఖండించింది. అవి పూర్తిగా బాధ్యతారాహిత్యమైన, ఆధార రహిత కథనాలని పేర్కొంది. 'నార్త్ 24 పరగణాస్ జిల్లాలో రాంఘాట్ గ్రామంలోని బగ్దా బ్లాక్‌లోని భూభాగంపై సందేహాలు -మిగతా 2 లో

## వారం పాటు ఢిల్లీ విమానాశ్రయం మూత

- రోజూ గంటన్నరపాటు అంతరాయం
- రిపబ్లిక్ డే రిహార్సల్స్ సందర్భంగా నిర్ణయం




న్యూఢిల్లీ,జనవరి 8(నీలగిరి ఎక్స్ ప్రెస్)
ఢిల్లీ ఎయిర్ పోర్టు వారం రోజుల పాటు మూత పడనుంది. ప్రతిరోజు గంటన్నరకు పైగా ఎయిర్ పోర్టు రన్ వే మూతపడనుండటంతో ప్రయాణికులకు ఎయిర్ పోర్టు అథారిటీ కీలక సూచనలు చేసింది. జనవరి 19 నుంచి 26 వరకు ఢిల్లీ ఎయిర్ పోర్టు రన్ వే రోజూ 145 నిమిషాలు మూతపడనుందని అధికారులు ప్రకటన విడుదల చేశారు. ఈ వారం రోజులు ఉదయం 10.20 నుంచి మధ్యాహ్నం 12.45 వరకు రిపబ్లిక్ సెలబ్రేషన్స్ లో -మిగతా 2 లో

## స్పేస్ నిర్మాణానికి ప్రధాని గ్రీన్ సిగ్నల్

- ఇస్రో కొత్త చీఫ్

తిరువనంతపురం,
ప్రముఖ రాకెట్ శాస్త్రవేత్త వీ నారాయణన్‌ను ఇస్రో చీఫ్‌గా నియమించిన విషయం తెలిసిందే. ఇస్రో చాలా విజయవంతమైన దశలో ఉన్నదని, చంద్రయాన్-4తో పాటు గగన్‌యాన్ మిషన్లు తమ ముందు ఉన్నట్లు ఆయన తెలిపారు. ఇస్రో ఛైర్మెన్‌తో పాటు అంతరిక్ష శాఖ కార్యదర్శిగా నియమితుడైన సందర్భంగా వీ నారాయణన్ సంతోషం వ్యక్తం చేశారు. ఎంతో మంది గొప్ప శాస్త్రవేత్తల నాయకత్వంలో సంస్థ కీర్తిగాంచిందని, అలాంటి సంస్థలో పనిచేయడం అదృష్టంగా -మిగతా 2 లో



## వేడెక్కిన ఢిల్లీ ఎన్నికల ప్రచారం

- 25 లక్షల ఆరోగ్యబీమా ప్రకటించిన కాంగ్రెస్
- శీష్‌మహల్ విమర్శలపై ఆప్, బిజెపిల ఆందోళన



న్యూఢిల్లీ,
దేశ రాజధాని ఢిల్లీ ఎన్నికలకు సంబంధించిన షెడ్యూల్‌ను కేంద్ర ఎన్నికల సంఘం విడుదల చేసిన క్రమంలో కాంగ్రెస్ ఢిల్లీ వాసులకు హామీల వర్షం కురిపిస్తోంది. తాజాగా 'జీవన్ రక్ష యోజన' అనే పథకాన్ని కాంగ్రెస్ ప్రవేశపెట్టింది. ఈ పథకం ద్వారా ఒక్కో కుటుంబానికి రూ.25లక్షల ఆరోగ్యబీమా కల్పిస్తామని కాంగ్రెస్ హామీ ఇచ్చింది. కాంగ్రెస్ సీనియర్ నేత, రాజస్థాన్ మాజీ సీఎం అశోక్ గహ్లోత్ బుధవారం ఈ పథకాన్ని ప్రవేశపెట్టారు. రాజస్థాన్‌లో తాము -మిగతా 2 లో

# చంద్రబాబు లక్ష్యాలకు అండగా ఉంటా

(మొదటి తరువాయి)

రాష్ట్ర ప్రజల ఆశలు, ఆశయాల సాధనకు మద్దతుగా నిలుస్తామని మోదీ హామీ ఇచ్చారు.ఏపీలో రూ.2.08 లక్షల కోట్ల విలువైన ప్రాజెక్టులకు ప్రధాని మోదీ శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేశారు. ఈ సందర్భంగా విశాఖ ఏయూ ఇంజినీరింగ్ కళాశాల మైదానంలో ఏర్పాటు చేసిన బహిరంగ సభలో ఆయన ప్రసంగించారు. 'ఆంధ్రప్రదేశ్ ప్రజల ప్రేమ, అభిమానానికి కృతజ్ఞతలు. మీ ఆశీర్వాదంతో 60 ఏళ్ల తర్వాత తొలిసారి మేం మూడోసారి అధికారంలోకి వచ్చాం. రాష్ట్రానికి అన్ని రంగాల్లో మద్దతుగా నిలుస్తున్నాం. 2047 నాటికి 2.5 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థను లక్ష్యంగా పెట్టుకున్నారు. ఈ రాష్ట్రంతో భుజం భుజం కలిపి నడుస్తాం. ఇవాళ తలపెట్టిన ప్రాజెక్టులు రాష్ట్ర వికాసానికి తోడ్పడతాయని మోడీ అన్నారు ఐటీ, టెక్నాలజీకి ఆంధ్రప్రదేశ్ ప్రధాన కేంద్రం కానుంది. ఈ ప్రాజెక్టులు రాష్ట్ర అభివృద్ధిని సరికొత్త శిఖరాలకు చేరుస్తాయి. 2030లోగా 5 మిలియన్ టన్నుల గ్రీన్ హైడ్రోజన్ ఉత్పత్తి మా లక్ష్యం. దేశంలో 2 గ్రీన్ హైడ్రోజన్ హబ్‌లు వస్తుంటే.. దానిలో ఒకటి విశాఖకు కేటాయించాం. గ్రీన్ హైడ్రోజన్ హబ్ ద్వారా ఎంతో మందికి ఉపాధి లభిస్తుందని భరోసా ఇచ్చారు. నక్కపల్లిలో బల్క్‌డ్రగ్ పార్కుకు శంకుస్థాపన చేశాం. కేవలం 3 రాష్ట్రాల్లోనే ఇలాంటి పార్కులు వస్తున్నాయి. చెన్నై-బెంగళూరు పారిశ్రామిక కారిడార్‌లో క్రిస్ సిటీ భాగం అవుతుంది. ఇప్పటికే శ్రీసిటీ ద్వారా ఏపీలో తయారీరంగం ఊపందుకుంది. దక్షిణ కోస్తా రైల్వే జోన్‌కు పునాదిరాయి వేశాం. రాష్ట్ర అభివృద్ధిలో రైల్వే జోన్ కీలకం కానుంది. రైల్వే జోన్ ద్వారా రాష్ట్ర ప్రజల చిరకాల వాంఛ నెరవేరుతుంది. రైల్వే జోన్ వల్ల వ్యవసాయ, పర్యాటక రంగాలు ఊపందుకుంటాయి. రాష్ట్రంలో ఇప్పటికే 7 వందేభారత్ రైళ్లు నడుస్తున్నాయి. అమృత్ భారత్ కింద ఏపీలోని 70కి పైగా రైల్వేస్టేషన్లు ఆధునికీకరణ చేపట్టాం' అని ప్రధాని మోడీ వివరించారు. మూడోసారి ప్రధానిగా నరేంద్ర మోదీ బాధ్యతలు స్వీకరించిన తర్వాత తొలిసారిగా ఆంధ్రప్రదేశ్‌లో పర్యటించారు. ఈ క్రమంలో నేడు విశాఖపట్నంలో రూ.2.08 లక్షల కోట్ల విలువైన ప్రాజెక్టులను ప్రారంభించారు. ఈ నేపథ్యంలో మాట్లాడిన ప్రధాని తన అభిమానాన్ని చూపించే అవకాశం ఇప్పుడు వచ్చిందని పేర్కొన్నారు. తెలుగులో ప్రసంగం మొదలు పెట్టిన ప్రధాని మోదీ.. ఆంధ్ర ప్రజల ప్రేమ, అభిమానానికి కృతజ్ఞతలు తెలియజేశారు. ఐదేళ్ల తర్వాత ఏపీలో ఎన్డీఏ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిందని.. చంద్రబాబు స్పీచ్‌తో సిక్సర్ కొట్టారని పేర్కొన్నారు. 60 ఏళ్ల తర్వాత దేశంలో మూడోసారి ఎన్డీఏ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిందని మోదీ గుర్తు చేశారు. ఈ నేపథ్యంలో రాష్ట్రంలో చంద్రబాబు లక్ష్యాలకు మేం ఎప్పుడూ అండగా ఉంటామని ప్రధాని అన్నారు. ఏపీ ప్రజల ఆశలు, ఆశయాలకు మద్దతుగా నిలుస్తామని చెప్పారు. ఏపీకి అన్ని రంగాల్లో మద్దతుగా నిలుస్తున్నామని, ఏపీతో భుజం భుజం కలిపి నడుస్తామని మోదీ పేర్కొన్నారు. ఇవాళ తలపెట్టిన ప్రాజెక్టులు రాష్ట్ర వికాసానికి తోడ్పడతాయని ప్రధాని వెల్లడించారు. దీంతోపాటు ఐటీ, టెక్నాలజీకి ఏపీ ప్రధాన కేంద్రం కానుందని ప్రధాని మోదీ అభిప్రాయం వ్యక్తం చేశారు. ఈ ప్రాజెక్టులు ఏపీ అభివృద్ధిని సరికొత్త శిఖరాలకు చేరుస్తాయని ప్రధాని మోదీ అన్నారు. 2030లోగా 5 మిలియన్ టన్నుల గ్రీన్ హైడ్రోజన్ ఉత్పత్తి చేయడమే మా లక్ష్యమని ప్రధాని తెలిపారు. నవయుగ పట్టణీకరణకు ఏపీ సాక్ష్యంగా మారబోతోందని ఈ సందర్భంగా మోదీ చెప్పారు. విశాఖ ప్రత్యేక రైల్వే జోన్ డిమాండ్ చాలా కాలంగా ఉందని, చిరకాల కోరిక ఈరోజు నెరవేరిందన్నారు. రైల్వే జోన్ రాకతో వ్యవసాయంతోపాటు అనేక వ్యాపారాలు కూడా అభివృద్ధి చెందుతాయన్నారు. ఏపీ అభివృద్ధి మా విజన్ అని మరోసారి గుర్తు చేశారు ప్రధాని మోదీ. 'దేశంలో రెండు గ్రీన్ హైడ్రోజన్ హబ్‌లు వస్తుంటే.. అందులో ఒకటి విశాఖకు కేటాయించాం. గ్రీన్ హైడ్రోజన్ హబ్ ద్వారా ఎంతోమందికి ఉపాధి లభిస్తుంది. నక్కపల్లిలో బల్క్ డ్రగ్ పార్క్‌కు శంకుస్థాపన చేశాం. 3 రాష్ట్రాల్లోనే ఇలాంటి బల్క్ డ్రగ్ పార్కులు వస్తున్నాయి. చెన్నై-బెంగళూరు పారిశ్రామిక కారిడార్‌లో క్రిస్ సిటీ భాగం అవుతుంది. ఇప్పటికే శ్రీసిటీ ద్వారా ఏపీలో తయారీరంగం ఊపందుకుంది. దక్షిణ కోస్తా రైల్వే జోన్‌కు పునాదిరాయి వేశాం. రాష్ట్ర అభివృద్ధిలో రైల్వే జోన్ కీలకం కానుంది. రైల్వే జోన్ ద్వారా రాష్ట్ర ప్రజల చిరకాల వాంఛ నెరవేరుతుంది. రైల్వేజోన్ వల్ల వ్యవసాయ, పర్యాటక రంగాలు ఊపందు కుంటాయని ప్రధాని మోదీ అన్నారు. ప్రధాని మోడీ అంతకుముందు విశాఖలో నిర్వహించిన ర్యాలీలో పాల్గొన్నారు. దీనికి భారీగా జనం హాజరై మోడీకి అభివాదం తెలిపారు. బహిరంగ సభలో ప్రధాన ప్రసంగాన్ని తెలుగులో కేంద్రమంత్రి రామ్మోహన్ నాయుడు అనువాదం చేసి అందించారు.

# కేసులు అసలు సమస్యే కాదు

(మొదటి తరువాయి)

పెద్ద విషయం కాదు. నా కేసుల గురించి ఆందోళన, ఇబ్బంది లేదు' అని అన్నారు. సుప్రీంకోర్టులో న్యాయపోరాటం చేస్తానని తెలిపారు. ఈ రేసులో ఒక్క పైసా కూడా అవినీతి జరగలేదని వెల్లడించారు. బీఆర్ఎస్ కార్యకర్తలు రైతు, ప్రజా సమస్యలపై పోరాటం చేయాలని పిలుపు నిచ్చారు. 2025లో బీఆర్ఎస్‌కు కొత్త కమిటీలు పూర్తి చేస్తామన్నారు. గ్రామస్థాయి నుంచి రాష్ట్రస్థాయి కమిటీలు నియమిస్తామన్నారు. ఈఏడాది పార్టీ అధ్యక్షుడిని ఎన్నుకుంటామని తెలిపారు. జిల్లాల్లోనే పార్టీ క్యాడర్‌కు శిక్షణ కేంద్రాలు ఏర్పాటు చేస్తామన్నారు. తెలంగాణ ప్రయోజనాల కోసం బీఆర్ఎస్‌ను కాపాడుకోవాల్సిన అవసరం ఉందన్నారు. రైతన్నకు జరుగుతోన్న మోసాన్ని ప్రజలకు వివరించాలని.. మెత్తంగా 30 శాతం రుణమాఫీ మాత్రమే జరిగిందని కేటీఆర్ పేర్కొన్నారు. బీఆర్ఎస్ పార్టీ 2001లో కేసీఆర్ పార్టీ పెట్టిన నాడు ఉన్న ఇబ్బందులతో పోల్చితే ఇప్పుడు ఉన్నవి పెద్దవి కాదు. ప్రత్యేక రాష్ట్రాన్ని సాధించిన కేసీఆర్ బిడ్డగా, ఆయన తయారు చేసిన సైనికుడిగా నేను ఎంతో ధైర్యంగా ఉంటా. తెలంగాణలో 90 లక్షల మంది మహిళలకు నెలకు రూ. 2,500 ఇస్తున్నట్లు దిల్లీ కాంగ్రెస్ నేతలు అబద్దాలు చెబుతున్నారని అన్నారు. ఈ సందర్భంగా హరీష్‌రావు మాట్లాడుతూ.. ఆనాడు డైరీ ఆవిష్కరణలు ఉద్యమ కేంద్రాలుగా ఉండేవని... నేటి డైరీ ఆవిష్కరణ తిరిగి బీఆర్ఎస్‌ను అధికారంలోకి వచ్చేందుకు ఉపయోగపడుతుందని అన్నారు. రేవంత్ రెడ్డి సంవత్సర కాలంగా చేసింది ఎగవేతలు, కేసులే అని వ్యాఖ్యలు చేశారు. ఎనుముల రేవంత్ రెడ్డి కాదు.. ఎగవేతల రేవంత్ రెడ్డి అంటూ ఎద్దేవా చేశారు. డైవర్షన్‌లు తప్ప రేవంత్ రెడ్డి చేసింది ఏమిలేదన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల కోసమే రైతు భరోసా వేస్తారని ఆరోపించారు. అధికారంలోకి రాగానే ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం పెన్షన్‌లు పెంచిందన్నారు. ఎవరు ప్రశ్నిస్తే వాళ్ళ మీద కేసులు పెట్టి అణిచివేసే ప్రయత్నం చేస్తున్నారు అంటూ ముఖ్యమంత్రిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. రేవంత్ రెడ్డి భూములకు ఆరులైన్ల రోడ్లు వేసుకుంటున్నారని.. అప్పులపై అసెంబ్లీలోనే ప్రభుత్వం నోరు మూయించామన్నారు. లగచర్ల రైతులకు అండగా కేటీఆర్ నిలబడ్డారని.. కేటీఆర్ ఉద్యమకారుడు, కార్యకర్తే అని తెలిపారు. ఆయనకు ఆపద వస్తే పార్టీ అంతా అండగా ఉండాలని కోరారు. కేటీఆర్‌పై అక్రమ కేసు పెట్టి అన్యాయంగా ఇరికించే ప్రయత్నం చేస్తున్నారు. దృష్టి మళ్లింపు తప్ప ప్రజలకు రేవంత్ రెడ్డి చేసిందేమీ లేదు. స్థానిక సంస్థల ఎన్నికల కోసం ఒక్కసారి రైతు భరోసా ఇచ్చి మళ్లీ ఎగ్గొడతారు. దిల్లీకి కమీషన్లు పంపేందుకు డబ్బులు ఉన్నాయి కానీ... పేదలకు ఇవ్వడానికి డబ్బులు లేవంటున్నారు. ప్రశ్నించినందుకే కేటీఆర్‌పై అక్రమ కేసులు పెడుతున్నారని హరీశ్‌రావు అన్నారు.

## వారం పాటు ఢిల్లీ విమానాశ్రయం మూత

(మొదటి తరువాయి)

భాగంగా మూసివేయ నున్నారు. ప్రతిరోజూ ఈ సమయంలో డ్రిల్స్, డ్రెస్ రిహార్సల్స్, రిపబ్లిక్ డే పరేడ్ తదితర కార్యక్రమాలు ఉండనున్నాయి. రిపబ్లిక్ డే వేడుకల కోసం భద్రతా కారణాల దృష్ట్యా నోటామ్ ఢిల్లీ విమానాశ్రయం రన్‌వే జనవరి 19 నుంచి జనవరి 26 వరకు ప్రతిరోజూ 145 నిమిషాల పాటు మూసివేయబడుతుంది. ఉదయం 10:20 నుంచి మధ్యాహ్నం 12:45 వరకు రిహార్సల్స్, రిపబ్లిక్ డే పరేడ్ సందర్భంగా ఈ నిర్ణయం తీసుకున్నారు. అయితే ఈ వారం రోజులపాటు మధ్యాహ్నం వరకు ఢిల్లీ ఎయిర్ పోర్ట్ రన్‌వే మూసివేస్తే 1,300 కంటే ఎక్కువ విమానాలకు అంతరాయం కలుగుతుందని అధికారులు చెబుతున్నారు. ఈ నేపథ్యంలో విమానయాన పరిశోధన సంస్థ సిరియమ్ ప్రకారం 1,336 విమానాలపై ఈ ప్రభావం పడే అవకాశం ఉందన్నారు. వాటిలో 665 బయలుదేరేవి కాగా, 671 రాకపోకలు సాగించేవన్నారు. దీంతోపాటు టొరంటో, వాషింగ్టన్, తాష్కెంట్, కొలంబో వంటి గమ్యస్థానాలకు వెళ్లే అంతర్జాతీయ విమానాలు కూడా ప్రభావితమయ్యాయి. ఈ క్రమంలో కొన్ని విమానాలు పూర్తిగా రద్దు కాకుండా రీషెడ్యూల్‌ను ప్రకటించే అవకాశం ఉంటుంది. ఇటీవల ఢిల్లీలో పొగమంచు గరిష్ట స్థాయికి చేరుకున్న కారణంగా వందల సంఖ్యలో విమానాలు ఆలస్యం అయిన సంఘటన వెలుగులోకి వచ్చింది. ఈ నేపథ్యంలో ఢిల్లీకి వచ్చే, ఢిల్లీ నుంచి బయలుదేరే ప్రయాణీకులు ప్రయాణించే ముందు విమాన మార్పుల సమాచారం గురించి తెలుసుకోవాలని సూచిస్తున్నారు. అప్‌డేట్‌ల కోసం మీ ఎయిర్‌లైన్ ఫోన్ నంబర్, ఇమెయిల్ వంటివి అందుబాటులో ఉంచుకోవాలని చెబుతున్నారు. వీలైతే పరిమిత గంటల తర్వాత విమానాలను రీబుక్ చేసుకోవాలని అంటున్నారు. రద్దు చేసిన సందర్భంలో విమానయాన సంస్థలు సాధారణంగా ప్రత్యామ్నాయ విమానాలు లేదా వాపసులను అందిస్తాయి. చివరి నిమిషంలో మళ్లీ నమోదు చేసుకోవాలి. ఈ క్రమంలో అధిక ఖర్చులకు సిద్ధంగా ఉండాలని కూడా పలు సంస్థలు చెబుతున్నాయి. విమానయాన సంస్థలు దేశవ్యాప్తంగా ఉన్న విమానాశ్రయాలతో సమన్వయం చేస్తున్నందున షెడ్యూల్ మార్పులు, విమాన రద్దు వంటి కార్యకలాపాల గురించి నివేదికలను పంపిస్తుంది. అయినప్పటికీ ఢిల్లీలో దాదాపు పూర్తి సామర్థ్యంతో పాటు ముంబై విమానాశ్రయంలో పరిమితుల కారణంగా విమానాల రీషెడ్యూల్ వంటి సవాళ్లను ఎదుర్కొనే అవకాశం ఉంది.

## స్పేస్ నిర్మాణానికి ప్రధాని గ్రీన్ సిగ్నల్

(మొదటి తరువాయి)

భావిస్తున్నట్లు ఆయన చెప్పారు. ఇస్రో చాలా గొప్ప సంస్థ అని, గతంలో అనేక మంది గొప్ప నేతలు దీన్ని నడిపించారని, ఈ సంస్థలో భాగస్వామ్యం కావడం అదృష్టంగా భావిస్తున్నట్లు తెలిపారు. ఓ ప్రశ్నకు బదులిస్తూ.. తన నియామకం గురించి తొలుత ప్రధాన మంత్రి కార్యాలయం నుంచి ఫోన్ వచ్చినట్లు వీ నారాయణన్ చెప్పారు. ప్రధానియే అన్నీ డిసైడ్ చేస్తున్నారని, పీఎంవో తనను కాంటాక్ట్ అయ్యిందని, ప్రస్తుతం ఇస్రో చైర్మెన్ ఎస్ సోమనాథ్ కూడా తనకు ఫోన్ కాల్ చేశారని, కొత్త అపాయింట్మెంట్ గురించి చెప్పినట్లు ఆయన వెల్లడించారు. త్వరలో చేపట్టబోయే ఇస్రో ప్రాజెక్టుల గురించి మాట్లాడుతూ.. ఇస్రో చాలా కీలకమైన మిషన్లను చేపడుతున్నదని, ప్రస్తుతం ఇస్రో విజయవంతమైన దశలో వెళ్తోందన్నారు. చేపట్టబోయే ప్రాజెక్టుల గురించి వివరిస్తూ.. స్పెడెక్స్ మిషన్‌ను డిసెంబర్ 30వ తేదీన చేపట్టామని, జనవరి 9వ తేదీన స్పెడెక్స్ శాటిలైట్ల డాకింగ్ జరగనున్నట్లు ఆయన తెలిపారు. గగన్‌యాన్ కూడా ఇస్రో ముందున్న అతిపెద్ద ప్రోగ్రామ్ అని పేర్కొన్నారు. క్రూ లేకుండా మాడ్యూల్‌ను ప్రయోగించే దాని కోసం ఇస్రోలో పనులు జరుగుతున్నాయన్నారు. జీఎస్ఎల్వీ ద్వారా ఎన్వీఎస్ 02 నావిగేషన్ శాటిలైట్ను పంపేందుకు శ్రీహరికోటలో వర్క్ జరుగుతోందన్నారు. ఇస్రో మార్క్ 3 వెహికిల్ ద్వారా అమెరికాకు చెందిన కమర్షియల్ శాటిలైట్‌ను కూడా ప్రయోగించనున్నారు. గగన్‌యాన్ రాకెట్ అసెంబ్లింగ్‌కు చెందిన పనులు కూడా శ్రీహరికోట్లో ప్రోగ్రెస్ అవుతున్నాయి. చంద్రయాన్3 ద్వారా చంద్రుడి దక్షిణ ధ్రువంపై ల్యాండ్ అయిన విషయం అందరికీ తెలిసిందే అన్నారు. చంద్రయాన్ 4 ద్వారా ఆ ప్రదేశంలో చంద్రుడిపై ల్యాండ్ అయి, శ్యాంపిళ్లు సేకరించిన తర్వాత మళ్లీ తిరిగి వచ్చే రీతిలో పనులు జరుగుతున్నాయన్నారు. భారత స్పేస్ స్టేషన్‌ని సెటప్ చేసేందుకు ప్లాన్ జరుగుతోందన్నారు. స్పేస్ స్టేషన్ నిర్మాణం కోసం ప్రధాని మోదీ అనుమతి కూడా తమకు దక్కిందన్నారు. స్పేస్ స్టేషన్‌కు అయిదు మాడ్యూళు ఉంటాయని, 2028లో స్పేస్ స్టేషన్‌కు తొలి మాడ్యూల్‌ను లాంచ్ చేసే రీతిలో అనుమతి దక్కిందన్నారు.

## గ్రూప్-3 ప్రిలిమనరీ కీ విడుదల

(మొదటి తరువాయి)

చేసుకోగా.. 2,69,483 మంది మాత్రమే పరీక్షకు హాజరయ్యారు. గ్రూప్ 3 ప్రిలిమినరీ కీపై జనవరి 12 సాయంత్రం 5గంటల వరకు అభ్యంతరాలు స్వీకరించనున్నారు. ఇంగ్లిష్‌లోనే అభ్యంతరాలను తెలపాలని, అభ్యర్థులు లేవనెత్తిన అంశాలకు సంబంధించిన ఆధారాల కాపీలను ఆన్‌లైన్‌లో సబ్‌మిట్ చేయాలని సూచించారు. ఈ-మెయిల్, వ్యక్తిగతంగా వెళ్లి సమర్పించడాన్ని ఎట్టిపరిస్థితుల్లో అనుమతించబోమని స్పష్టంచేశారు. ఇదిలావుంటే మే 1 నుంచి కొత్త ఉద్యోగాలకు నోటిఫికేషన్లు విడుదల చేస్తామని టీజీపీఎస్సీ వెల్లడించింది. మార్చి 31లోగా ఉద్యోగ ఖాళీల వివరాలను ఇవ్వాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరినట్లు పేర్కొంది. ఖాళీల ప్రకారం నోటిఫికేషన్ల జారీపై ఏప్రిల్‌లో కసరత్తు చేస్తామని తెలిపింది. కొత్త నోటిఫికేషన్లు ఇచ్చి 6-8 నెలల్లో భర్తీ ప్రక్రియను పూర్తి చేస్తామని కమిషన్ ప్రకటించింది. గురువారం గ్రూప్-3 'కీ' విడుదల చేయనుంది. రెండ్రోజుల్లో గ్రూప్-2 'కీ' విడుదల చేయనున్నట్టు టీజీపీఎస్సీ తెలిపింది. షెడ్యూల్ ప్రకారం ఫలితాలు వచ్చేలా పనిచేస్తున్నామని టీజీపీఎస్సీ ఛైర్మన్ బుర్రా వెంకటేశం తెలిపారు. ఈనెల 11, 12 తేదీల్లో బెంగళూరులో పబ్లిక్ సర్వీస్ కమిషన్ల సదస్సు ఉంటుందని, ఉద్యోగ పరీక్షల విధానాలపై సదస్సులో చర్చించనున్నట్టు చెప్పారు.

## భారత భూభాగం ఆక్రమణ

(మొదటి తరువాయి)

వ్యక్తమవుతున్నాయి. ఇక్కడ అంతర్జాతీయ సరిహద్దు కొడల్యా నదీ తీరం నుంచి వెళుతుంది. ఇరువైపులా కచ్చితమైన హద్దులను గుర్తించి స్తంభాలు పాతి వేసిన కంచె ఉంది. ఇక ఈ సరిహద్దు వెంట బీఎస్ఎఫ్ గస్తీలో ఎటువంటి మార్పు జరగలేదు. ఒక్క అంగుళం భారత భూభాగాన్ని తీసుకోలేదు, తీసుకోలేరు కూడా. 1975 భారత్ బంగ్లా బోర్డర్ గైడ్‌లైన్స్ ఆధారంగా బీఎస్ఎఫ్, బీజీబీ వాటి విధులను ప్రశాంతంగా నిర్వహిస్తున్నాయి' అని బీఎస్ఎఫ్ దక్షిణ బెంగాల్ ఫ్రంటియర్ పేర్కొంది. అంతేకాదు.. కంచె లేని చోట్ల కూడా బంగ్లాదేశీల చొరబాట్లు, స్మగ్లింగ్ వంటివి జరగకుండా కఠినచర్యలు తీసుకొన్నట్లు బీఎస్ఎఫ్ వివరించింది. బంగ్లాదేశ్‌కు చెందిన మీడియాలోని కొన్ని వర్గాలు నిరాధారంగా వీటిని ప్రచారం చేస్తున్నాయని బీఎస్ఎఫ్ అభిప్రాయపడింది. అంతేకాదు.. బోర్డర్ గార్డ్స్ బంగ్లాదేశ్ (బీజీబీ) మోటార్ బోట్లు, ఏటీవీలతో డిసెంబర్ 19 నుంచి గస్తీ మొదలుపెట్టిందన్న ప్రచారాన్ని కూడా కొట్టిపారేసింది. మాల్దా జిల్లాలో సుక్‌దేబ్‌పుర్‌లో సరిహద్దుల వెంట బీఎస్ఎఫ్, బీజీబీ గార్డ్స్‌కు మధ్య ఫెన్సింగ్ విషయంలో గొడవ జరిగింది. భారత్ వైపు కంచె నిర్మాణానికి బంగ్లాదేశ్ అభ్యంతరం వ్యక్తం చేసింది. ఆ తర్వాత కొద్దిసేపటికే అక్కడ గ్రామాల్లో ప్రజలు చేరుకొని వందేమాతరం, భారత్ మాతాకీ జై వంటి నినాదాలు చేశారు. ఆ తర్వాత బీఎస్ఎఫ్ దళాలు స్పందిస్తూ ముందస్తుగా ఇరుదేశాలు చేసుకొన్న ఒప్పందం ప్రకారం దానిని నిర్మిస్తున్నట్లు బీజీబీకి నచ్చజెప్పారు. ఆ తర్వాత తిరిగి కంచె పనులు మొదలు పెట్టారు.

## ఆప్‌కు మద్దతు పలికిన మమతా బెనర్జీ

(మొదటి తరువాయి)

కేజ్రీవాల్ ఆమెకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ మేరకు ఆయన 'థాంక్యూ దీదీ' అంటూ 'ఎక్స్'లో పోస్టు పెట్టారు. 'దిల్లీ ఎన్నికల్లో ఆప్‌నకు తృణమూల్ కాంగ్రెస్ మద్దతు ప్రకటించింది. మమత దీదీకి వ్యక్తిగతంగా కృతజ్ఞతలు తెలుపుతున్నా. థాంక్యూ దీదీ. మా మంచి చెడుల్లో మీరు ఎల్లప్పుడూ అండగా నిలిచారు' అని కేజ్రీవాల్ పేర్కొన్నారు. తాజా పరిణామంతో దిల్లీ అసెంబ్లీ ఎన్నికల్లో ఆప్‌నకు మద్దతుగా నిలిచిన 'ఇండియా' కూటమి మిత్రపక్షాల జాబితాలో తాజాగా ఆప్ చేరడం గమనార్హం. గతంలో సమాజ్‌వాదీ పార్టీ, శివసేన (యూబీటీ) కేజ్రీవాల్‌కు మద్దతు ప్రకటించాయి. గతేడాది జరిగిన లోక్‌సభ ఎన్నికల్లో కాంగ్రెస్‌తో పొత్తు పెట్టుకున్న ఆప్.. ఆ తర్వాత జరిగిన హరియాణా ఎన్నికల్లో ఒంటరి పోరాటం చేసిన విషయం తెలిసిందే. దిల్లీలో మత్తం 70 అసెంబ్లీ స్థానాలు ఉండగా.. 2015లో 67 స్థానాలు గెలుచుకొని తొలిసారి అధికారంలోకి వచ్చిన ఆప్.. ఆ తర్వాత 2020లో 62 సీట్లతో అధికారం నిలబెట్టుకుని ఇప్పుడు హ్యాట్రిక్ విజయం కోసం కృషిచేస్తోంది.

## వేడెక్కిన ఢిల్లీ ఎన్నికల ప్రచారం

(మొదటి తరువాయి)

అధికారంలో ఉన్నప్పుడు ఇదే పథకాన్ని అమలుచేశామని గుర్తుచేశారు. ఎలాంటి షరతులు, పరిమితులు లేకుండా దీన్ని అమలుచేసినట్లు తెలిపారు. దిల్లీకి ఈ పథకం ఓ గేమ్‌ఛేంజర్ అవుతుందని ఆయన పేర్కొన్నారు. ఇప్పటికే 'ప్యారీ దీదీ యోజన' పథకం కింద ప్రతి మహిళకు ప్రతి నెలా రూ.2,500 ఇస్తామని కాంగ్రెస్ హామీ ఇచ్చిన విషయం తెలిసిందే.ఇదిలాఉండగా.. దేశ రాజధాని దిల్లీలో జరిగే ఎన్నికలకు కేంద్ర ఎన్నికల సంఘం మంగళవారం షెడ్యూల్ విడుదల చేసింది. మొత్తం 70 శాసనసభ స్థానాలకు ఫిబ్రవరి 5న ఎన్నికలు జరగనున్నాయి. ఫిబ్రవరి 8న ఫలితాలు వెలువడనున్నాయి. ఇదిలావుంటే అసెంబ్లీ ఎన్నికలు సమీపిస్తోన్న తరుణంలో దిల్లీ రాజకీయాలు వేడెక్కాయి. ఆప్, భాజపా ఏ వేదికా వదలకుండా విమర్శలు చేసుకుంటున్నాయి. ఈ సమయంలో 'సీఎం బంగ్లా' వివాదం రాజకీయ దుమారం రేపుతోంది. ఈ బంగ్లాను 'శీష్ మహల్ అంటూ భాజపా చేస్తోన్న విమర్శలను ఆప్ తిప్పికొడుతోంది. తాజాగా 'నిజాన్ని చూపిస్తాం' అంటూ ఆ పార్టీ సంజయ్ సింగ్, సౌరభ్ భరద్వాజ్ మీడియాను తీసుకొని ఆ అధికారిక నివాసం వద్దకు వెళ్లారు. అయితే వారి ప్రయత్నాన్ని పోలీసులు అడ్డుకున్నారు. మంత్రి, ఎంపీ అధికారాలను పోలీసులు అడ్డుకుంటున్నారని ఆప్ నేతలు మండిపడ్డారు. దాంతో సీఎం నివాసం ముందు గందరగోళ వాతావరణం నెలకొంది. ఆ అధికారిక నివాసంలోకి వెళ్లేందుకు ఆప్ నేతలకు అనుమతి లేదని పోలీసులు తేల్చిచెప్పారు. దానిలో భాగంగా బారికేడ్లు ఏర్పాటుచేశారు. భారీగా పోలీసులను మోహరించారు. 'ఎవరినీ లోపలికి అనుమతించ వద్దంటూ పైనుంచి ఆదేశాలు వచ్చాయని పోలీసులు చెప్పారు. ఈ పోలీసు చర్య భాజపాకు సంతోషాన్ని కలిగిస్తుంది' అని సౌరభ్ విమర్శించారు.

## తెలుగు పంచాంగం 9/1/2025, బుధశారం

సమయ సమాచారం:
సూర్యోదయం: ఉదయం 6:50
సూర్యాస్తమయం: సాయంత్రం 5:54
తిథి:
శుక్ల పక్ష దశమి
ప్రారంభం: జనవరి 8 ఉదయం 6:44
ముగింపు: జనవరి 9 ఉదయం 8:04
నక్షత్రం:
అశ్విని
ప్రారంభం: జనవరి 8 ఉదయం 3:06
ముగింపు: జనవరి 9 ఉదయం 4:20
శుభ సమయాలు:
అమృతకాలం: మధ్యాహ్నం 1:00 నుండి 2:36 వరకు
అభిజిత్ ముహూర్తం: మధ్యాహ్నం 11:58 నుండి 12:42 వరకు
అశుభ సమయాలు:
రాహుకాలం: మధ్యాహ్నం 1:43 నుండి 3:06 వరకు
యమగండం: ఉదయం 9:34 నుండి 10:56 వరకు
దుర్ముహూర్తం:
ఉదయం 10:42 నుండి 11:23 వరకు
మధ్యాహ్నం 2:50 నుండి 3:32 వరకు
వర్జ్యం: రాత్రి 12:04 నుండి 1:38 వరకు

పండితుల సూచన:
గురువారం రోజున బ్రహస్పతి దేవుని పూజ విశేషమైన ఫలితాలను అందిస్తుంది. పసుపు, అక్షతలు సమర్పించడం, అలాగే గోధూమ ప్రసాదం పంపిణీ చేయడం ద్వారా భక్తులు జ్ఞానం, ధనం మరియు సౌభాగ్యాన్ని పొందగలరని పండితులు సూచిస్తున్నారు.

# రైస్ మిల్లర్ల తో ఆమనగల్లు మార్కెట్ చైర్మన్ గీతా నర్సింహ సమావేశం




**ఆమనగల్లు, జనవరి 8(నీలగిరి ఎక్స్ ప్రెస్)**
ఆమనగల్లు మార్కెట్ ను అన్ని రంగాలలో అభివృద్ధి పరిచి ఆదర్శంగా నిలుపుతామని ఆమనగల్లు మార్కెట్ కమిటీ చైర్మన్ గీతా నర్సింహ అన్నారు. బుధవారం మార్కెట్ చైర్పర్సన్ గా నూతనంగా బాధ్యతలు చేపట్టిన గీతా నర్సింహకు అభినందన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, మార్కెట్ ఆదాయాన్ని పెంచి రైతుల శ్రేయస్సుకు పాటుపడేలా మిల్లర్లు ప్రభుత్వ నిబంధనలకు లోబడి నడుచుకోవాలని కోరారు. వ్యవసాయ రంగ అభివృద్ధి, రైతుల సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వం పెద్దపీట వేస్తుందని తెలిపారు. సంక్రాంతి పండుగ అనంతరం ప్రభుత్వం ప్రకటించిన విధంగా అర్హులైన రైతులందరికీ రైతు భరోసా పథకం కింద రూ. 12 వేలు పెట్టుబడి సాయం అందిస్తుందని చెప్పారు. మిల్లర్లు ప్రభుత్వ నిబంధనలకు లోబడి నడుచుకోవాలని సూచించిన గీతా నర్సింహ, జీరో వ్యాపారానికి ఇక్కడ తావివ్వకూడదని, మిల్లర్లు అందరూ విధిగా లైసెన్సులను రెన్యూవల్ చేయించుకోవాలని కోరారు. ఈ ఏడాది ధాన్యం దిగుబడి బాగా వచ్చినందున మార్కెట్ ఆదాయం పెరిగేలా చూడాలని, మార్కెట్ అభివృద్ధికి ట్రేడర్లు, మిల్లర్లు సహకరించాలని గీతా నర్సింహ అన్నారు. మార్కెట్ లో రైతులకు మెరుగైన వసతులు కల్పించి ఇబ్బందులు లేకుండా చూస్తామని, రైతులు పంట ఉత్పత్తులు మార్కెట్ యార్డులో విక్రయించి ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధర పొందాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో రైస్ మిల్లర్ల అసోసియేషన్ అధ్యక్షుడు మిట్టపల్లి అంజయ్య, నాయకులు కండె పాండురంగయ్య, దోనోదుల సత్యం, అనిల్ రామకృష్ణ, కండె సుమన్, కృష్ణయ్య, కరుణాకర్, రాము, విష్ణువర్ధన్, శ్రీనివాస్, కండె భాస్కర్, సత్యం, యాదయ్య, వెంకటయ్య, ప్రకాష్, మార్కెట్ కార్యదర్శి శ్రీనివాస్ రెడ్డి, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# గ్రీన్‌ఫీల్డ్ రోడ్డు నిర్మాణాన్ని ఆపాలని రైతుల డిమాండ్





**ఆమనగల్లు, జనవరి 8(నీలగిరి ఎక్స్ ప్రెస్)**
ఆమనగల్లు మున్సిపాలిటీ మూడోవ వార్డు సాకిబండతాండలో గ్రీన్‌ఫీల్డ్ హైవే భూ సర్వే, రెవెన్యూ మరియు పోలీస్ అధికారులను అడ్డుకున్న రైతులు భూ బాధితులు భారీ ఎత్తున చేరుకోవడంతో, అక్కడి నుండి రెవెన్యూ అధికారులు వెనక్కి వెళ్లిపోయారు. గ్రీన్‌ఫీల్డ్ హైవే భూ బాధితులకు అండగా నిలిచిన ఆమనగల్లు మున్సిపాలిటీ చైర్మన్ రాంపాల్ నాయక్, ఆమనగల్లు మాజీ జెడ్పిటిసి పత్యానాయక్, కౌన్సిలర్ విక్రమ్ రెడ్డి, భూ బాధితులకు భరోసా ఇచ్చారు. తండవాసులు తమ మూడు పంటలు పండించే భూములను వదులుకోబోమని స్పష్టం చేశారు. రైతులు భారీ ఎత్తున పొలాల్లోకి రావడంతో రెవెన్యూ అధికారులు, భూ సర్వే అధికారులు, పోలీస్ యంత్రాంగం వెనక్కి వెళ్ళిపోయారు. ఈరోజు రంగారెడ్డి జిల్లా ఆమనగల్లు మున్సిపాలిటీ పరిధిలోని సాకిబండతాండలో రైతులు గ్రీన్‌ఫీల్డ్ రోడ్డు నిర్మాణాన్ని వ్యతిరేకిస్తూ, రంగారెడ్డి జిల్లా కలెక్టర్, కందుకూరు రెవెన్యూ డివిజన్ ఆర్డీఓ, ఆమనగల్లు ఎమ్మార్వో కార్యాలయాలకు తమ బాధలను వినిపించారు. వెంటనే గ్రీన్‌ఫీల్డ్ సర్వేను ఆపివేయాలని డిమాండ్ చేశారు. తమ భూములను బలవంతంగా తీసుకుంటూ నిర్మిస్తున్న గ్రీన్‌ఫీల్డ్ హైవే నిర్మాణాన్ని వెంటనే నిలిపివేయాలని రైతులు డిమాండ్ చేశారు. సోమవారం రంగారెడ్డి జిల్లా ఆమనగల్లు మున్సిపాలిటీ ఆకుతోటపల్లి, సాకిబండతాండ, మాలేపల్లి రైతులు కలెక్టర్, ఆర్డీవో, ఎమ్మార్వో కార్యాలయాలకు మెమరాండం అందజేశారు. రైతులు మాట్లాడుతూ గ్రీన్‌ఫీల్డ్ హైవే నిర్మాణానికి పచ్చని పంటపొలాలను ప్రభుత్వం గుంజుకుంటుందని, వెంటనే ఈ నిర్మాణాన్ని నిలిపివేయాలని అన్నారు. కాని అధికారులు పట్టించుకోకుండా ల్యాండ్ సర్వే చేయించడం అన్యాయమని ఆరోపించారు. రైతులు అధికారులను గ్రీన్‌ఫీల్డ్ రోడ్డు నిర్మాణం నిలిపి వేయాలని కోరారు. లేకపోతే రాష్ట్ర ప్రభుత్వంపై పోరాటం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న రైతులు మణిపాల్, బోడ్యి, చందర్, పాండు, రవిరాథోడ్, రమేష్, గోపి, లాలు, విజేందర్, రాజా, వినోద్, గోపి, శివరాం, జాన్యా, పత్య, రమ్మి, కుమార్, హరి, తరుణ్ తదితరులు పాల్గొన్నారు.

# రంగారెడ్డి జిల్లా వడ్డెర సంఘం అధ్యక్షులుగా వరికుప్పల తిరుమలేష్





**రంగారెడ్డి జనవరి 08 (నీలగిరి ఎక్స్ ప్రెస్ )**
– రంగారెడ్డి జిల్లా వడ్డెర సంఘం అధ్యక్షులుగా యాచారం మండలం మాల్ గ్రామానికి చెందిన వరికుప్పల తిరుమలేష్ ఎన్నికయ్యారు. ఈ మేరకు భారతీయ వడ్డెర సమాజ సేవా సంఘం ఆధ్వర్యంలో రంగారెడ్డి జిల్లా వడ్డెర ముఖ్య నాయకుల సమావేశం జరిగింది. ఇట్టి సమావేశంలో తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు ఎత్తరి మారయ్య మాట్లాడుతూ,దేశంలో అధిక శాతం వడ్డెర కులస్తులు వివిధ రాష్ట్రాల్లో ఎస్సీ,ఎస్టీలుగా ఉన్నారని,తెలుగు రాష్ట్రాలలో మాత్రం వడ్డెర కులాన్ని బీసీ జాబితాలో చేర్చి వడ్డెర కులానికి తీరని అన్యాయం చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. ఏది ఏమైనా భారతీయ వడ్డెర సమాజ సేవ సంఘం జాతీయ అధ్యక్షులు వెంకటేష్ మౌర్య ఆధ్వర్యంలో వివిధ రాష్ట్రాల వారు ఎలాగైతే వారి సత్తాను చాటి వారి రిజర్వేషన్లు సాదించుకున్నారో,అదే విధంగా తెలంగాణ రాష్ట్రంలోను వడ్డెర కుల సత్తాను చాటి వడ్డెర కులస్తులకు దక్కవలసిన ఎస్టి రిజర్వేషన్ను వడ్డెర కుల ఐక్యమత్యంతో సాధించుకుందామని అన్నారు. అనంతరం రంగారెడ్డి జిల్లా నూతన కమిటీని ఎన్నుకోవడం జరిగింది. రంగారెడ్డి జిల్లా వడ్డెర సంఘం అధ్యక్షులుగా వరికుప్పల తిరుమలేష్ ను ఎన్నుకున్నారు. ఈ సందర్బంగా వరికుప్పల తిరుమలేష్ మాట్లాడుతూ వడ్డెరుల సంక్షేమం కోసం తన వంతు కృషి చేస్తానన్నారు. తన నియామకానికి సహకరించిన రాష్ట్ర,జిల్లా,మండల నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ య్నొక్క కార్యక్రమంలో రాష్ట్ర యువజన అధ్యక్షులు కొమ్మరాజుల శేఖర్,రాష్ట్ర మహిళా అధ్యక్షురాలు రూప మహేశ్వరి,రంగారెడ్డి జిల్లా నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## పుష్పాలంకరణలో పాల్గొన్న మాజీ మంత్రి



**వనపర్తి, జనవరి 8(నీలగిరి ఎక్స్ ప్రెస్) :**
కొండూరు. నరేష్,రామ్ కుమార్ ఆహ్వానం మేరకు కలకొండ సునీత రామ్ మోహన్ కూతురు శ్రావణిపుష్పాలంకరణ వేడుక తరుణ్ణి ఫంక్షన్ హాల్ నందు జరిగింది. ఇట్టి వేడుకకు హాజరైన మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి శ్రావణి నీ ఆశీర్వదించారు. నిరంజన్ రెడ్డివెంట వాకిటిశ్రీధర్, నందిమల్లఅశోక్, మంద. రాము, ముద్దు సార్ ఉన్నారు.

# ప్రజా సమస్యల పరిష్కారం, పట్టణ అభివృద్ధిలో రాజకీయాలకు తావుండరాదన్న ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి




**ఆమనగల్లు, జనవరి 8(నీలగిరి ఎక్స్ ప్రెస్):**
ఆమనగల్లు మున్సిపాలిటిలో సాధారణ నిధులతో చేపట్టే సి.సి రోడ్లు, అండర్ డ్రైనేజి నిర్మాణ పనులకు రూ. 83 లక్షలతో శంకుస్థాపన చేసిన కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి, ప్రజా సమస్యల పరిష్కారం, పట్టణ అభివృద్ధిలో రాజకీయాలకు తావుండరాదని సూచించారు. అభివృద్ధి పనులు నాణ్యతగా పూర్తి కావడానికి అధికారులు, ప్రజాప్రతినిధులతో పాటు ప్రజలంతా పర్యవేక్షించాలని ఆయన పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, కల్వకుర్తి నియోజకవర్గంలోని అన్ని గ్రామపంచాయతీలు, పురపాలక సంఘాల అభివృద్ధికి శాయశక్తులా కృషి చేస్తున్నట్లు తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం అనేక సంక్షేమ పథకాలు పకడ్బందిగా అమలుచేస్తూ, ఈ సంక్రాంతి నుండి మరిన్ని పథకాలు ప్రారంభించనున్నదని తెలిపారు. మున్సిపాలిటీ నిధులతో చేపడుతున్న అభివృద్ధి పనులను నాణ్యతగా, త్వరితగతిన పూర్తి చేసి ప్రజల ఇబ్బందులు తొలగించేలా చూడాలని మున్సిపల్ కమీషనర్, పాలకవర్గానికి సూచించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ రాంపాల్ నాయక్, వైస్ చైర్మన్ దుర్గయ్య, మార్కెట్ కమిటీ చైర్మన్ గీతా నరసింహ, వైస్ చైర్మన్ భాస్కర్ రెడ్డి, మున్సిపల్ కమిషనర్ వసంత, మున్సిపల్ కౌన్సిలర్లు, ఏఎంసీ డైరెక్టర్లు రమేష్, శ్రీశైలం, కండె రంగయ్య, తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ సభ్యులు శ్రీనివాస్ గౌడ్, కేఎన్ఆర్ సేవాదళం వ్యవస్థాపక అధ్యక్షుడు మెకానిక్ బాబా,గిరిజన సేవా సంఘం రాష్ట్ర అధ్యక్షుడు హనుమనాయక్, మాజీ ఎంపీపీ ధనంజయ, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు జగన్, మున్సిపల్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు మానయ్య, మాజీ ఎంపీపీ అనిత విజయ్, శివలింగం, అప్పం శీను, ఖాదర్ ఖాద్రి, గాజుల శీను, వాటర్ బాబా, వెంకట్ రెడ్డి, సురేష్, శ్రీనివాస్ రెడ్డి, మల్లేష్ నాయక్, అలీమ్, నాజర్, సురేష్ నాయక్, ఫరీద్, సలీం, మున్సిపల్ పాలకవర్గం సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## యువకుడు అదృశ్యం



**ఘట్‌కేసర్, జనవరి08 జనవరి 8(నీలగిరి ఎక్స్ ప్రెస్):**
తాగి ఎందుకు వచ్చావని కుటుంబ సభ్యులు మందలించడంతో మనస్థాపానికి గురై ఇంటినుంచి ఓ యువకుడు బయటకు వెళ్లి తిరిగి రాని సంఘటన ఘట్‌కేసర్ పోలీసుస్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఘట్‌కేసర్ ఎన్ఎఫ్‌సీ నగర్ నందంకాలనీకి చెందిన బొజ్జ మనోజ్ కుమార్(22) పెయింటర్. కాగా గత నెల 24 వ తేదీన రాత్రి ఇంటికి తాగి వచ్చాడు. దీంతో కుటుంబ సభ్యులు ఎందుకు తాగి వచ్చావని మందలించారు. దీంతో ఇంట్లో గొడవ పడి మనోజ్‌కుమార్ బయటకు వెళ్లాడు. అప్పటి నుంచి మనోజ్ కుమార్ ఇంటికి తిరిగి రాలేదు. దీంతో ఆందోళన చెందిన కుటుంబ సభ్యులు బంధువులు, స్నేహితుల ఇళ్లల్లో వాకబు చేశారు. అయినా ఫలితం లేకపోవడంతో పోలీసులకు ఫిర్యాదుచేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

## కొందుర్గ్ ప్రీమియర్ లీగ్ క్రికెట్ పోటీలను ప్రారంభించిన షాద్ నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్

**-అందరి సహకారంతోనే అభివృద్ధి సాధ్యం - ఎమ్మెల్యే**



**కొందుర్గ్, జనవరి 8(నీలగిరి ఎక్స్ ప్రెస్)**
కొందుర్గ్ మండల కేంద్రంలో కొందుర్గ్ ప్రీమియర్ లీగ్ క్రికెట్ పోటీలను షాద్ నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ...వ్యవసాయ ఆధారిత మండలాలైన కొందుర్గ్ మరియు చౌదరిగూడ మండలాలు మరింత అభివృద్ధి చెందాలనే ఉద్దేశంతో ఇంటిగ్రేటెడ్ స్కూల్, మిని స్టేడియం, పరిగి - షాద్ నగర్ రొడ్డును 4 లైన్స్ ల రొడ్డుగా విస్తరించే పనులను చేపట్టనున్నట్లు తెలిపారు.రాజకీయాలకు అతీతంగా మండలాన్ని అభివృద్ధి చేసుకుందాం అని తెలియజేశారు. త్వరలో మండలంలో ఉన్న క్రీడాకారులకు అన్ని హంగులతో,అన్ని వసతులతో స్టేడియం ను అందుబాటులోకి తీయటానికి ప్రయత్నిస్తున్నాను అని తెలిపారు. క్రీడల్లో కూడా మంచిగా రాణించి రాష్ట్ర,దేశ స్థాయిలో ప్రాతినిధ్యం వహించాలని కోరారు.భవిష్యత్ లో క్రీడాల్లో రాణించడం వలన ఉద్యోగ అవకాశలు కూడా ఉంటాయని తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం క్రీడల పట్ల ప్రత్యేక శ్రద్ధ వహిస్తూ, క్రీడా కార్పొరేషన్ కి నిధులను కేటాయించిన విషయాన్ని గుర్తు చేశారు.ఈ కార్యక్రమంలో తెలంగాణ ఒలింపిక్ సంఘం రాష్ట్ర సంయుక్త కార్యదర్శి కొండ విజయ్ కుమార్,కాంగ్రెస్ మండల పార్టీ అధ్యక్షుడు కృష్ణా రెడ్డి,రాజేష్ పటేల్,యాదయ్య, రామయ్య గౌడ్,దామోదర్ రెడ్డి,అక్రమ్, కె కె కృష్ణ,రామకృష్ణ, శ్రీధర్ రెడ్డి,యాదయ్య తదితరులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ గురుకులాల్లో ప్రవేశాల కోసం దరఖాస్తులు చేసుకోవాలి

**జిల్లా కలెక్టర్ సి. నారాయణ రెడ్డి.**

**రంగారెడ్డి, జనవరి 8(నీలగిరి ఎక్స్ ప్రెస్)**
ఉజ్వల భవిష్యత్తుకు బంగారు బాటలు వేస్తున్న ప్రభుత్వ గురుకులాల్లో ప్రవేశాల కోసం విద్యార్థినీ విద్యార్థులు ఆన్లైన్ లో దరఖాస్తులు చేసుకోవాలని కలెక్టర్ సి. నారాయణ రెడ్డి సూచించారు.2025-26 విద్యా సంవత్సరంలో వివిధ గురుకులాల్లో ఆంగ్ల మాధ్యమంలో ప్రవేశాల కోసం ప్రభుత్వం ఈ ఏడాది ఫిబ్రవరి 23న కామన్ ఎంట్రన్స్ టెస్ట్ నిర్వహించనుందని తెలిపారు.గురుకులాల్లో విద్యను అభ్యసించదల్చిన బాలబాలికలు https://tgcet.cgg.gov.in ద్వారా ఆన్లైన్ లో ఫిబ్రవరి 01వ తేదీలోపు దరఖాస్తులు చేసుకోవాలని కలెక్టర్ సూచించారు.దరఖాస్తు చేసుకునేందుకు కుల ధ్రువీకరణ పత్రం నెంబరు,ఆదాయ ధ్రువీకరణ పత్రం నెంబరు,ఆధార్ కార్డు నెంబరు,బర్త్ సర్టిఫికెట్,ఫోటో అవసరమని తెలిపారు.పై ధ్రువీకరణ పత్రాల సత్వర జారీ కోసం కలెక్టరేట్లో సహాయ కేంద్రం ఏర్పాటు చేశామని,ఉదయం 10 గంటల నుండి సాయంత్రం 5 గంటల వరకు ఈ కేంద్రం తెరిచి ఉంటుందని అన్నారు.2025-26 విద్యా సంవత్సరానికి గాను ఎస్సీ,ఎస్టీ,బీసీ,సాధారణ గురుకులాల్లో ప్రవేశాల కోసం ఆసక్తి గల విద్యార్థులు ఆన్లైన్ ద్వారా గడువులోపు దరఖాస్తులు చేసుకోవాలని కలెక్టర్ సి.నారాయణ రెడ్డి సూచించారు.ఈ అవకాశాన్ని విద్యార్థిని, విద్యార్థులు, వారి తల్లిదండ్రులు సద్వినియోగం చేసుకోవాలని అన్నారు...

## ఇచ్చిన హామీల హామలు పై దృష్టి పెట్టండి

**- పాలమూరు విష్ణువర్ధన్ రెడ్డి**

**హైదరాబాద్, జనవరి 8(నీలగిరి ఎక్స్ ప్రెస్)**



బిజెపి రాష్ట్ర కార్యాలయం పై కాంగ్రెస్ గుండాలు చేసిన దాడిని తీవ్రంగా ఖండిస్తున్నానని బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పాలమూరు విష్ణువర్ధన్ రెడ్డి అన్నారు. తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి ఎన్నికల్లో ఇచ్చిన హామీల హామలు పై ద్రుష్టి పెట్టి అభివృద్ధి పనులు చేయాలని, కానీ బిజెపి రాష్ట్ర కార్యాలయం పైకి గుండాలను పంపి దాడి చేయడం పిరికి పందల చర్య అని అన్నారు. భారతీయ జనతా పార్టీ దాడి చేయాలని అనుకుంటే దేశంలో ఉన్న కాంగ్రెస్ పార్టీ కార్యాలయాలు మిగలవని, బిజెపి పార్టీ సిద్ధాంతం గల పార్టీగా దాడులను ప్రోత్సహించదని, నిన్న జరిగిన సంఘటనలో దుండగులను గుర్తించి కఠినమైన చర్యలు తీసుకోవాలని పోలీస్ అధికారులను కోరారు. ముఖ్యంగా రైతులకు ఇచ్చిన హామీ రైతు భరోసా హామలు చేయక రైతులు తీవ్ర అవస్థలు పడుతున్నారని, దానిపై ద్రుష్టి పెట్టాలని అన్నారు.

## ప్రభుత్వ ఉద్యోగి జీవితంలో పదవీ విరమణ తప్పనిసరి

**చింత సాయినాథ్**

**సంగారెడ్డి, 08జనవరి, జనవరి 8(నీలగిరి ఎక్స్ప్రెస్)**
విధుల్లో చేరిన నాటి నుంచి అహర్నిశలు కృషి చేసే ప్రభుత్వ ఉద్యోగి జీవితంలో పదవీ విరమణ తప్పనిసరని అని సంగారెడ్డి ఎమ్మెల్యే చింతా ప్రభాకర్ తనయుడు చింత సాయినాథ్ అన్నారు. వ్యాయామ విద్యా ఉపాధ్యాయులు మహ్మద్ శర్ఫోద్దీన్ అహ్మద్ పదవి విరమణ సందర్భంగా సంగారెడ్డి జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో చింత సాయినాథ్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. పదవి విరమణ చేసిన వ్యాయామ విద్యా ఉపాధ్యాయులు మహ్మద్ శర్ఫోద్దీన్ అహ్మద్ ను చింత సాయినాథ్ శాలువాతో సన్మానించి,పూలమలతో సత్కరించారు.ఈ కార్యక్రమంలో ఎంఈఓ విద్యాసాగర్, ఎంజీ అన్వార్, మసూద్ ,షకీల్ తదితరులు పాల్గొన్నారు.

## డేంజరస్ డ్రైవింగ్ వద్దు

**షాద్ నగర్ ట్రాఫిక్ సబ్ ఇన్స్పెక్టర్ రవీందర్ నాయక్**




**షాద్ నగర్, జనవరి 8(నీలగిరి ఎక్స్ ప్రెస్)**
నిబంధనలకు విరుద్ధంగా డేంజరస్ డ్రైవింగ్ చేయడం మంచిది కాదని, యువత ఎల్లప్పుడు ట్రాఫిక్ రూల్స్ పాటించాలని షాద్ నగర్ ట్రాఫిక్ సబ్ ఇన్స్పెక్టర్ రవీందర్ నాయక్ డిగ్రీ విద్యార్థులకు సూచించారు. జాతీయ రహదారుల భద్రత వారోత్సవాల సందర్భంగా విద్యార్థులను షాద్ నగర్ ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ తరపున చైతన్యపరిచారు. పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల, బిఏఎం డిగ్రీ కళాశాల, విజ్ఞాన్ డిగ్రీ కళాశాలలో అవగాహన సదస్సులను నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఐ రవీందర్ నాయక్ మాట్లాడుతూ, హెల్మెట్ లేకుండా బైక్ నడపడం, లైసెన్సు లేకుండా వాహనాలు నడపడం, త్రిబుల్ రైడింగ్, అత్యంత వేగంగా వాహనం నడపడం, రాంగ్ రూట్ లో వాహనాలు నడపడం వల్ల ట్రాఫిక్ నిబంధనలు పాటించకపోవడం వల్ల ఎన్నో ప్రమాదాలు జరుగుతున్నాయని విద్యార్థులకు వివరించారు. మైనర్ల చేతికి వాహనాలు ఇవ్వడం, డ్రంక్ అండ్ డ్రైవ్ లాంటి ట్రాఫిక్ రూల్స్ వ్యతిరేకమని ఎస్ఐ రవీందర్ నాయక్ తెలిపారు. యువత ట్రాఫిక్ రూల్స్ కచ్చితంగా పాటించాలని సూచించారు.

## తాటి చెట్టుపై నుంచి పడి గీత కార్మికుడి మృతి



**కద్తాల్, జనవరి 8(నీలగిరి ఎక్స్ ప్రెస్)**
తాటి చెట్టు పై నుంచి జారిపడి గీత కార్మికుడు మృతి చెందిన సంఘటన మండల పరిధిలోని ముద్విన్ గ్రామంలో సోమవారం సాయంత్రం చోటు చేసుకుంది. కద్తాల్ సిఐ శివప్రసాద్ తెలిపిన వివరాల ప్రకారం.. ముద్విన్ గ్రామానికి చెందిన కట్ట వేంకటయ్య (45) కుల వృత్తిలో భాగంగా ఎప్పటిలాగే సోమవారం సాయంత్రం గ్రామ సమీపంలోని వ్యవసాయ పొలంలో కల్లు గీసేందుకు తాటి చెట్టు ఎక్కాడు. ప్రమాదవశాత్తు నడుముకు ఉన్న మోకు జారడంతో, కట్ట వేంకటయ్య తాటి చెట్టు పై నుంచి కింద పడి తీవ్ర గాయాలయ్యాయి. గమనించిన స్థానికులు, వెంటనే కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. సంఘటన స్థలానికి చేరుకున్న కుటుంబ సభ్యులు క్షతగాత్రుడిని, చికిత్స నిమిత్తం హైదరాబాద్ ఆసుపత్రికి తరలించారు. చికిత్స అందిస్తుండగా వేంకటయ్య ఈరోజు ఉదయం మృతిచెందాడు. మృతుడికి భార్య సునిత, ఇద్దరు ఆడపిల్లలు ఉన్నారు. భార్య పిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సిఐ శివప్రసాద్ తెలిపారు.

## శివనారాయణతోపాటు ఇటీవల మరణించిన కుటుంబాలకుమాజీ మంత్రి నివాళులు







**వనపర్తి, జనవరి 8(నీలగిరి ఎక్స్ ప్రెస్):**
బి.ఆర్.ఎస్ నాయకులు డాక్టర్.శివనారాయణ నిన్న జరిగిన రోడ్ ప్రమాదంలో మరణించారు. విషయం తెలిసిన మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి కిష్టగిరి గ్రామములో వారి స్వగృహంలో శివనారాయణ పార్థీవదేహానికి పూలమాలలు సమర్పించి ఘనంగా నివాళులు అర్పించి కుటుంబ సభ్యులను పరామర్శించినారు .నిరంజన్ రెడ్డివెంట జిల్లా అధ్యక్షులు గట్టు యాదవ్, నందిమల్ల. అశోక్, మాణిక్యం ,ధర్మానాయక్, చిట్యాల.రాము బి.ఆర్.ఎస్ నాయకులు ఉన్నారు పెద్దమందడి మండలం బలిజేపల్లి, జంగమాయపల్లి,పామ్ రెడ్డిపల్లి గ్రామాలలోనిరంజన్ రెడ్డిఇటీవల మరణించిన కుటుంబాలను పరామర్శించి అండగా ఉంటానని భరోసా ఇచ్చి ఆర్థిక సహాయం అందజేసారు.ఇందులో పానుగంటి.పెంటయ్య, వడ్డే. బాల్ చంద్రయ్య,రాములు, పాతిమాబేగం, చిట్టెమ్మ, రాములు కుటుంబాలను పరామర్శించి ధైర్యం గా ఉండాలని అండగా ఉంటానని భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో రఘుపతి రెడ్డి, మాజీ సర్పంచ్ జయంతి మేడం,శేషివర్ధన్ రెడ్డి, నందిమల్ల.అశోక్, రఘువర్ధన్ రెడ్డి, గోవర్ధన్, సురేష్,సత్యం, నరేష్,కార్తీక్,గ్రామ నాయకులు తదితరులు ఉన్నారు.

## ఎమ్మెల్యేకు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపిన పెరుమాండ్ల సురేష్



**తలకొండపల్లి, జనవరి 8(నీలగిరి ఎక్స్ ప్రెస్)**
తలకొండపల్లి మండల పర్యటనలో భాగంగా కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి ని మర్యాదపూర్వకంగా కలిసిన యువ నాయకుడు పెరుమాళ్ళ సురేష్, శాలువాతో సన్మానించి 2025 నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేశారు. పెరుమాళ్ళ సురేష్ మాట్లాడుతూ, నూతన సంవత్సరంలో విద్యాశాఖ మంత్రిగా ఎన్నికై మంత్రివర్గంలో చోటు దక్కాలని, క్యాబినెట్ హోదా పొందాలని ఆశిస్తూ, ప్రజా పాలనలో భాగంగా కల్వకుర్తి నియోజకవర్గంలోని తలకొండపల్లి మండలానికి అధికనిధులు తీసుకొచ్చి మండల అభివృద్ధికి అన్ని విధాలుగా కృషి చేయాలని కోరారు. ఈ సందర్భంగా రోహిత్ రెడ్డి, స్థానిక నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## రేపటి నుంచి మెట్రో సంక్రాంతి ఉత్సవాలు



**హైదరాబాద్, జనవరి 8(నీలగిరి ఎక్స్ ప్రెస్)**
సంక్రాంతి పండుగ సంబురాలను అంగరంగ వైభవంగా నిర్వహించేందుకు హైదరాబాద్ మెట్రో సన్నాహాలు చేస్తోంది. రేపటి నుంచి (8,9,10) మూడు రోజుల పాటు 'మీటైం ఆన్ మై మెట్రో' క్యాంపెయిన్ పేరిట వేడుకలను నిర్వహిస్తోంది. పండుగ సంబురాలను ఎంజీబీఎస్ మెట్రో స్టేషన్లో ప్రారంభించనున్నారు. వేడుకల్లో భాగంగా తెలుగుదనం ఉట్టిపడేలా సాంస్కృతిక కార్యక్రమాలు, సాంప్రదాయాలను ప్రతిబింబించేలా కార్యక్రమాలు, తెలుగు ఔన్నత్యాన్ని చాటేలా వేడుకలను నిర్వహించేందుకు ఎల్ అండ్ టీ ఏర్పాట్లు చేసింది. నగరంలోని పలు స్టేషన్ల పరిధిలో ఈ వేడుకలు జరుగనున్నాయి. సంక్రాంతి పండుగ ఉత్సవాలకు హైదరాబాద్ మెట్రో తెగతీయనుంది. ముగ్గుల పోటీలు, పతంగుల పండుగలు, సంగీత కార్యక్రమాలు, సాంస్కృతిక ప్రదర్శనలు వంటి వివిధ కార్యక్రమాలను నగరంలోని మెట్రో స్టేషన్లలో నిర్వహించనున్నారు. ప్రజలంతా ఉత్సాహంగా పాల్గొని పండుగను ఆనందంగా జరుపుకోవాలని కోరారు.

## మహబూబ్నగర్ ఎంపీ డీకే అరుణను మర్యాదపూర్వకంగా కలిసిన బిజెపి నేతలు



**మహబూబ్ నగర్**
ఈరోజు మహబూబ్ నగర్ పట్టణంలోని ఎంపీ క్యాంప్ కార్యాలయంలో డీకే అరుణను మర్యాదపూర్వకంగా కలుసుకున్న బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు అందే బాబయ్య మరియు బిజెపి జిల్లా అధికార ప్రతినిధి కక్కునూరి వెంకటేష్ గుప్తా, వివిధ మండలాలకు చెందిన బిజెపి నేతలు ఎంపీని కలవడం జరిగింది.
ఈ సందర్భంగా షాద్ నగర్ నియోజకవర్గం రాజకీయ పరిస్థితులపై చర్చించడం జరిగింది.

## నూతన సంవత్సర క్యాలెండర్లను ఆవిష్కరించిన మాజీ ఎమ్మెల్యే వై. అంజయ్య యాదవ్



**షాద్ నగర్, జనవరి 8(నీలగిరి ఎక్స్ప్రెస్)**
షాద్ నగర్ మున్సిపల్ చైర్మన్ కొందూటి నరేందర్, 25వ వార్డు కౌన్సిలర్ మాధురినందకిషోర్ ముద్రించిన నూతన సంవత్సర క్యాలెండర్లను మాజీ ఎమ్మెల్యే అంజయ్య యాదవ్ ఆవిష్కరించారు. ఈ నూతన సంవత్సరంలో ప్రజలందరూ సుఖ సంతోషాలతో ఉండాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ ఎం. ఎస్ నటరాజ్, కౌన్సిలర్ రెటికల్ నందీశ్వర్, నాయకులు నక్కల వెంకటేష్ గౌడ్, గుండు అశోక్, సందీప్, రాధాకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

# చెట్టు = అమ్మ, చెత్త = రోగం

చెట్టు మన జీవితానికి అమ్మంత ప్రాముఖ్యమైనది. అది మనకు ప్రాణవాయువును అందిస్తుంది, ప్రకృతిని సంరక్షిస్తుంది, మన శ్రేయస్సుకు తోడ్పడుతుంది. చెట్టు ఉంటే జీవితం ఉందని చెప్పడం అసత్యం కాదు. మరోవైపు, చెత్త అనేది రోగాలకు కారణమవుతుంది. చెత్త ఎక్కడైతే పేరుకుపోతుందో అక్కడ పర్యావరణం కలుషితమవుతుంది, నీరు, గాలి, నేల నాశనం అవుతాయి.

**చెట్టు ఎలా అమ్మలా ఉంటుంది:**
-మనకు ఆక్సిజన్ అందిస్తుంది.
-నీడ, చల్లదనం, ఆహారం, చెక్క, ఔషధాలు అందిస్తుంది.
-ప్రకృతి మనుగడలో కీలక పాత్ర పోషిస్తుంది.

**చెత్త ఎలా రోగంగా మారుతుంది:**
-చెత్త పేరుకుపోతే దోమలు, చీమలు, బ్యాక్టీరియా పుట్టుక.
-కాలుష్యం వల్ల శ్వాసకోశ, నీరు మరియు ఆహారానికి సంబంధించిన రోగాలు.

చెట్టు మన జీవితానికి అమ్మవంటిది. అందుకే మనం చెట్లను నాటాలి, వాటిని కాపాడాలి.
చెత్త మన జీవనానికి రోగం. అందుకే చెత్తను తగ్గించాలి, పునర్వినియోగం చేయాలి, పర్యావరణాన్ని స్వచ్ఛంగా ఉంచాలి.

"ప్రకృతిని ప్రేమిద్దాం, జీవనాన్ని కాపాడుకుందాం!"
మీ నరేష్ దండు సామాజిక కార్యకర్త

# అభివృద్ధిని చూసి ఓర్వలేక ప్రతిపక్షాలు ఆరోపణలు

**– ఎలుగొండ మధుసూదన్ రెడ్డి**



**ఆమనగల్లు, జనవరి 8(నీలగిరి ఎక్స్ ప్రెస్):** రాష్ట్రంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేపడుతున్న ప్రజాపాలనను చూసి ఓర్వలేక విపక్షాలు అసత్య ఆరోపణలు చేస్తున్నాయని నాగర్ కర్నూల్ పార్లమెంటు ఇంచార్జ్ ఎలుగొండ మధుసూదన్ రెడ్డి మండిపడ్డారు. గత ప్రభుత్వం చేసిన అవినీతిని కప్పిపుచ్చుకోవడానికే తమ ప్రభుత్వంపై విమర్శలు చేస్తున్నారని ధ్వజమెత్తారు. నేడు వనపర్తి జిల్లాలో ఉపముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క పర్యటన సందర్భంగా ఆమనగల్లులో బుధవారం ఆమనగల్లు మార్కెట్ కమిటీ మాజీ వైస్ చైర్మన్ గుర్రం కేశవులు, స్థానిక నాయకులతో కలిసి మల్లు భట్టి విక్రమార్క స్వాగత ఏర్పాట్లను మధుసూదన్ రెడ్డి పర్యవేక్షించారు. వనపర్తి జిల్లాలో పలు అభివృద్ధి, సబ్ స్టేషన్లు ప్రారంభోత్సవ కార్యక్రమాలకు ఉపముఖ్యమంత్రి శంకుస్థాపన చేస్తున్నట్లు తెలిపారు. అనంతరం మండల కేంద్రంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మధుసూదన్ రెడ్డి మాట్లాడుతూ, రేవంత్ సర్కార్ ఇచ్చిన హామీలే కాదు, ఇవ్వని హామీలను కూడా నెరవేరుస్తుందని తెలిపారు. విద్య, వైద్యంపై తమ ప్రభుత్వం ఎంతో చిత్తశుద్ధితో పనిచేస్తుందని పేర్కొన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి పూర్వపు పాలమూరు జిల్లా వాసి కాబట్టి కల్వకుర్తి నియోజకవర్గాన్ని మహానగరంగా మార్చేందుకు వేగంగా అడుగులు వేస్తున్నారని తెలిపారు. ముచ్చర్ల వద్ద ఫోర్త్ సిటీ, గ్రీన్ ఫార్మా స్కిల్ యూనివర్సిటీ, హెల్త్ ఎడ్యుకేషన్ హబ్, ఇండస్ట్రియల్ పార్కు, మెట్రో రైల్ రాకతో శరవేగంగా అభివృద్ధి చెందుతుందని ముఖ్యమంత్రి చెప్పారని ఆయన పేర్కొన్నారు. గ్రీన్ ఫీల్డ్ రోడ్డు నిర్మాణంతో ఆమనగల్లు, కడ్తాల్ మండలాల రైతులు అధైర్యపడవద్దని ఆయన కోరారు.

# కాంగ్రెస్ అంటే కాలయాపనకు కేరఫ్

-చేసింది శూన్యం మిగిలేది అరణ్యం
-స్థానిక సంస్థల్లో చావు దెబ్బ ఖాయం
-బీఆర్ఎస్ జిల్లా నేత శ్రీధర్



**వనపర్తి, జనవరి 8(నీలగిరి ఎక్స్ ప్రెస్) :** అధికారంలోకి వచ్చి ఏడాది దాటినా కాంగ్రెస్ ప్రభుత్వం కాలయాపన చేసింది తప్ప రాష్ట్ర ప్రజలకు చేసింది శూన్యమేనని బీఆర్ఎస్ జిల్లా అధికార ప్రతినిధి మాజీ మున్సిపల్ వైస్ చైర్మెన్ వాకిటి శ్రీధర్ ఎద్దేవా చేశారు . బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ అధికారంలోకి రావడానికి అలవి కాని హామీలిచ్చి ప్రజలను మోసం చేస్తున్నారని అన్నారు. ఎలాంటి అభివృద్ధి పనులు చేపట్టకుండానే ఎనలేని అప్పులు చేసి రాష్ట్రాన్ని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దివాలా తీయించారని దుయ్యబట్టారు. కేసీఆర్ పదేళ్ళ పాలనలో సంపద సృష్టించి దేశంలోనే తెలంగాణను నెంబర్ వన్ స్థానంలో ఉంచారని గుర్తు చేశారు. రైతు రుణమాఫీ పూర్తి స్థాయిలో చేయలేదని, కుంటి సాకులు చూపుతూ రైతు భరోసాను ఎగ్గొట్టడానికి కుయుక్తులు పన్నుతున్నారని దెప్పి పొడిచారు. మహిళలకు నెలకు రూ. 2,500 పింఛన్లు, కళ్యాణలక్ష్మి షాదీ మబారక్ లకు అదనంగా ఇస్తానన్న తులం బంగారం ఏమైందో ప్రజలకు వివరించాలని డిమాండ్ చేశారు .రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో కర్రు కాల్చి వాత పెట్టడానికి ఓటర్లు సిద్దంగా ఉన్నారని వాకిటి శ్రీధర్ హెచ్చరించారు.

# ఎమ్మెల్యే మెఘూరెడ్డికి జన్మదిన శుభాకాంక్షలు చెప్పిన నేతలు



**వనపర్తి, జనవరి 8(నీలగిరి ఎక్స్ ప్రెస్) :** వనపర్తి ఎమ్మెల్యే మెఘూరెడ్డిని కాంగ్రెస్ నేతలు బుధవారం ఆయన నివాసంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఆయన జన్మదినం సందర్భంగా పలువురు పుష్పగుచ్చాలు అందజేసి శుభాకాంక్షలు చెప్పారు.అనంతరం నిర్వహించిన వేడుకలలో ఎమ్మెల్యే మెఘూరెడ్డి,శారద దంపతులు కేక్ కట్ చేసి స్వీట్లుపంపిణీ చేశారు.ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ కిచ్చరెడ్డి, కేబీ నాయుడు, కాంటెస్ట్ ఎమ్మెల్యే అభ్యర్థి దయానంద్, కాంగ్రెస్ నాయకులు మండ్ల దేవన్ననాయుడు, కాంగ్రెస్ నాయకులు బాలస్వామి నాయుడు, తదితరులు పాల్గొన్నారు.

# రాష్ట్ర బిజెపి కార్యాలయం పై దాడికి నిరసనగా వనపర్తి లో సీఎం దిష్టిబొమ్మ దగ్ధం



**వనపర్తి, జనవరి 8(నీలగిరి ఎక్స్ ప్రెస్) :** హైదరాబాదులో రాష్ట్ర బిజెపి ప్రధాన కార్యాలయం పై కాంగ్రెస్ కార్యకర్తలదాడికి నిరసనగా బుధవారం వనపర్తి జిల్లా కేంద్రంలో భారతీయ జనతా యువమోర్చా అధ్యక్షులు ఏ రాజశేఖర్ఆధ్వర్యంలో బిజెపి నాయకులు, కార్యకర్తలు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దిష్టిబొమ్మను దగ్ధం చేశారు. సందర్భంగా బిజెపి జిల్లా అధ్యక్షులు డి నారాయణ మాట్లాడుతూ ప్రజాస్వామ్యంలో ప్రతి ఒక్కరికి నిరసన తెలిపే హక్కు ఉంటుందని కానీ తెలంగాణ రాష్ట్రంలో ఎక్కడ లేని విధంగా కాంగ్రెస్ కార్యకర్తలు బిజెపి ప్రధాన కార్యాలయం పై కర్రలతో, రాళ్లతో దాడి చేశారని అన్నారు. నిరసన తెలుపడం ప్రజాస్వామ్యలో సహజం కానీ ఈ విధంగా దాడి చేయడం సమంజసం కాదన్నారు. మేము తిరిగి దాడి చేస్తే ఎవరు కాంగ్రెస్ కార్యకర్తలు దాక్కోవడానికి స్థలం కూడా దొరకదని అన్నారు. మీరు రెండు మూడు రాష్ట్రాలలో అధికారంలో ఉన్నారని, మేము 19 రాష్ట్రాలకు పైగా అధికారంలో ఉన్నామని మేముతలుచుకుంటే మీరు ఎక్కడ తిరగరని హెచ్చరించారు.ఈకార్యక్రమంలో జిల్లా పరిషత్ మాజీ చైర్మన్ లోక్నాథ్ రెడ్డి, పట్టణ అధ్యక్షులు బచ్చు రాము,అధికార ప్రతినిధి శ్రీశైలం, రామన్ గౌడ్, చిత్తారి ప్రభాకర్, బండారు కుమారస్వామి సీతారాములు, బీజేవైఎం అధ్యక్షులు రాజశేఖర్ గౌడ్, ఎద్దుల రాజు, రాయన్న సాగర్, కృష్ణ గౌడ్, తిరుమలేశ్, సాయి నరేష్, శివ, శ్రీకాంత్, వెంకటేష్ నాయక్, గోపీనాథ్,బిజెపి కార్యకర్తలు పాల్గొన్నారు.

# బీజేపీ కార్యాలయం పై కాంగ్రెస్ శ్రేణుల దాడిని నిరసిస్తూ ఆమనగల్లులో బీజేపీ నిరసన



**ఆమనగల్, జనవరి 8(నీలగిరి ఎక్స్ ప్రెస్)**
బీజేపీ రాష్ట్ర కార్యాలయం వద్ద కాంగ్రెస్ చేసిన దాడిని ఖండిస్తూ ఆమనగల్లు భారతీయ జనతా పార్టీ ఆధ్వర్యంలో జాతీయ రహదారిపై ర్యాలీ నిర్వహించి నిరసన కార్యక్రమం చేపట్టడం జరిగింది. పథకం ప్రకారమే కాంగ్రెస్ గూండాలు బిజెపి కార్యాలయం పై దాడికి ఒడిగట్టారు అని ఆమనగల్లు మున్సిపాలిటీ బిజెపి అధ్యక్షుడు శ్రీకాంత్ సింగ్ అన్నారు.ఈ కాంగ్రెస్ గూండాలకు పోలీసులు కొమ్ము కాస్తున్నారు! కాంగ్రెస్ తెర లేపుతున్న ఈ భౌతిక దాడుల సంస్కృతిని గాని బిజెపి మొదలుపెడితే, ఏ రాష్ట్రంలోనూ కాంగ్రెస్ పార్టీ కార్యాలయాలు నిలబడవు, ఏ కాంగ్రెస్ నాయకుడు రోడ్డు పై తిరగలేడు ఖబడ్దార్ అని ఆయన హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఆమనగల్లు మున్సిపాలిటీ బిజెపి అధ్యక్షుడు శ్రీకాంత్ సింగ్, మున్సిపల్ చైర్మన్ రాంపాల్, వైస్ చైర్మన్ దుర్గయ్య, మున్సిపల్ కౌన్సిలర్స్ గోరటి నర్సింహా, సుందుర్ శేఖర్, బైకని శ్రీశైలం యాదవ్, చెక్కల లక్ష్మణ్, దుడ్డు కృష్ణ, చెన్నకేశవులు, విక్రమ్ రెడ్డి, తల్లోజు విజయ్ కృష్ణ, కో ఆప్షన్ మెంబర్స్ మేడిశెట్టి శ్రీధర్, పాషా, బిజెపి నాయకులు, బీజేవైఎం నాయకులు బుచ్చయ్య, గోజ్జె నందు, శ్రీను, వడ్డే రాజు, బైకని అశోక్, నాగిళ్ల లక్ష్మణ్, పద్మ ప్రశాంత్, వరికుప్పల శ్రీనివాస్, గోరటి గిరి, ఎర్రవోలు మహేష్, ఎర్రవోలు రాజు, వరికుప్పల రాఘవేందర్, సందీప్, చెన్నకేశవులు, పవన్, బాలు, భాస్కర్ సీనియర్ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# కడ్తాల్ గ్రామాల గుండా మైనింగ్ లారీలను అరికట్టాలి



**కడ్తాల్, జనవరి 8(నీలగిరి ఎక్స్ ప్రెస్)**
కడ్తాల్ మండలంలోని వంపుగూడ, చెల్లంపల్లి గ్రామాల గుండా నిత్యం 100కు పైగా మైనింగ్ లారీలు తిరుగుతుండటంతో పొల్యూషన్ ఏర్పడే ప్రమాదం ఉందని గ్రామాల ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. మైనింగ్ లారీలు వలన ఎక్కువగా ప్రమాదాలు జరిగే అవకాశాలు ఉన్నందున, గ్రామాల ప్రజలు శ్వాసకోస వ్యాధులు బారిన పడకుండా చూడాలని, మైనింగ్ లారీలను గ్రామాల నుండి కాకుండా వేరే మార్గం ద్వారా పంపించాలని కోరుతున్నారు. ఈ సందర్భంగా, స్థానిక ఎమ్మార్వో ముంతాజ్ బేగం కు మండల కాంగ్రెస్ పార్టీ ఎస్సీ సెల్ అధ్యక్షుడు, మాజీ సర్పంచ్ నరేందర్, ఎస్సీ సెల్ బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు కంబాలపల్లి రామకృష్ణ, సేవాలాల్ సేన జిల్లా ప్రధాన కార్యదర్శి లక్పత్తి నాయకులు వినతిపత్రం అందజేశారు.

# మోతిలాల్ నాయక్ కు ఘన సన్మానం



**వెల్దండ, జనవరి 8(నీలగిరి ఎక్స్ ప్రెస్)**
: వెల్దండ మండల పార్టీ కాంగ్రెస్ అధ్యక్షుడు మోతిలాల్ నాయక్, నాగర్ కర్నూల్ జిల్లా అభివృద్ధి సమన్వయ పర్యవేక్షణ కమిటీ సభ్యులుగా నియమితులైన సందర్భంగా, బుధవారం వెల్దండ మండల కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో శాలువాతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో వెల్దండ కాంగ్రెస్ పార్టీ ఎస్టీ సెల్ అధ్యక్షుడు శంకర్ నాయక్, మాజీ సర్పంచ్ యెన్నం భూపతిరెడ్డి, వెల్దండ సింగల్ విండో డైరెక్టర్ మట్ట వెంకటయ్య గౌడ్, కిసాన్ సెల్ తాలూకా అధ్యక్షుడు పర్వత్ రెడ్డి, పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు ఎర్ర శీను, కాంగ్రెస్ నాయకులు కొయ్యల పుల్లయ్య, ఎండి రషీద్, రాహుల్ యాదవ్, పూల్ సింగ్, వెంకట్ నాయక్, లాల్ నాయక్, చందు నాయక్, పంతులు నాయక్, జయరాం నాయక్ తదితరులు పాల్గొన్నారు.

# హత్య కేసులో నిందితునికి జీవిత కారాగార జైలు శిక్ష



**-జిల్లాలో నేరాలకు పాల్పడిన వారికీ శిక్షలు తప్పవు**
**-ప్రజలు చట్టాన్ని తమ చేతుల్లోకి తీసుకోవద్దు ఎస్పీ రావుల గిరిధర్**

వనపర్తి, జనవరి 8(నీలగిరి ఎక్స్ ప్రెస్) : హత్యానేరం ఋజువై నందున నేరస్తునికి జీవిత కారగార జైలు శిక్షతో పాటు7,000/- రూ. జరిమానా విధించిన వనపర్తి జిల్లా ప్రధాన న్యాయమూర్తి శ్రీమతి ఎం ఆర్, సునీత బుధవారం తీర్పు ఇచ్చారని ఎస్పీ రావుల గిరిధర్ తెలిపారు.కేసు యొక్క వివరాలనుపరిశీలిస్తేఆత్మకూరు పోలీస్టేషన్ పరిధిలోని బాలకిష్టపూర్ తాండకు చెందిన మూడవత్ మణెమ్మ ను భర్త గోపాల్ నాయక్ పెట్రోల్ పోసి తగులబెట్టి చంపినందున కొడుకు కృష్ణ ఫిర్యాదు పై తేది:05-11-2020 అప్పటి ఆత్మకూరు ఎస్సై, ముత్తయ్య %ఎతీ-అశీ 106/2020 ఖ/o 302, 498 (ూ) ూజ% నందు కేసు నమోదు చేయగా తేదీ 20.12 2020 రోజు మృతురాలు మరణించగా అప్పటి సీఐ సీతయ్య ఇన్వెస్టిగేషన్ ప్రారంభించారు. మృతురాలు ఇచ్చిన మరణ వాంగ్మూలంపై విచారణ జరిపి భార్యను వేధింపులకు గురిచేసి పెట్రోల్ పోసి చంపిన నిందితుడు మూడవత్ గోపాల్ పై అప్పటి సీఐ సీతయ్య ఛార్జ్ షీట్ ఫైల్ చేశారు. ప్రస్తుత సీఐ, శివకుమార్ , ఎస్సై, నరేందర్ ఆదేశాల మేరకు కోర్టు లైజనింగ్ అధికారి హెడ్ కానిస్టేబుల్, సత్యం, కోర్టు డ్యూటీ ఆఫీసర్లు రాజేందర్ సాక్షులను కోర్టులో ప్రవేశపెట్టగా పబ్లిక్రాసిక్యూటర్ శ్రీ బి. గోపాల్ రెడ్డి కోర్టులో వాదనలు వినిపించగా నేరస్తునిపై నేరం నిరూపణ అయినందున బుధవారం జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఎం ఆర్ సునీత తీర్పు ఇచ్చారని ఎస్పీ శ్రీ రావుల గిరిధర్ తెలిపారు. ఈ కేసులో నేరస్తునికి శిక్ష పడడంలో బాగా పనిచేసిన పోలీస్ అధికారులను, పబ్లిక్ ప్రాసిక్యూటర్ ను, కోర్టు డ్యూటీ ఆఫీసర్లను ఎస్పీ అభినందించి త్వరలో రివార్డు ఇవ్వడం జరుగుతుందని తెలిపారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ.. సమాజంలో నేరం చేసిన వారు ఎవరూ కూడా శిక్ష నుండి తప్పించుకొలేరని, ప్రజలు ఎవరు కూడా చట్టాన్ని తమ చేతిలోకి తీసుకోవద్దని ఎస్పీ తెలిపారు.పోలిసులు ,ప్రాసిక్యూషన్ వారు వ్యూహంతో న్యాయ విచారణ , న్యాయ నిరూపణ జరిపి కచ్చితంగా శిక్షలు పడేలా చేస్తారని సూచించారు.

# వెల్దండ గురుకుల ప్రవేశ దరఖాస్తుకు చివరి తేదీ జనవరి 31



వెల్దండ, జనవరి 8(నీలగిరి ఎక్స్ ప్రెస్) వెల్దండ మండలంలోని తెలంగాణ గురుకుల పాఠశాలలో ఐదో తరగతి, ఆరవ తరగతి నుంచి తొమ్మిదవ తరగతి వరకు మిగిలిన సీట్ల భర్తీ కోసం ప్రవేశ పరీక్షలు జరుగనున్నాయి. సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల ప్రిన్సిపల్ స్వర్ణ రత్న బుధవారము ఒక ప్రకటనలో తెలిపారు. సంబంధిత ధ్రువపత్రాలతో ఈ నెల 31 తేదీలోపు దరఖాస్తు చేసుకోవాలని కోరారు. ప్రవేశ పరీక్ష ఫిబ్రవరి 23న నిర్వహించబడుతుంది. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

# రాష్ట్ర ముఖ్యమంత్రి కి పాలాభిషేకం



వెల్దండ, జనవరి 8(నీలగిరి ఎక్స్ ప్రెస్) వెల్దండ మండల కేంద్రంలో వివిధ గ్రామాలకు బిటి రోడ్డు నిధులు విడుదల చేయడం పట్ల రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి, నాగర్ కర్నూల్ పార్లమెంటు సభ్యులు డాక్టర్ మల్లు రవి, స్థానిక ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డికి వెల్దండ మండలంలో ఈరోజు ఘనంగా పాలాభిషేకం చేశారు. కాంగ్రెస్ పార్టీ ప్రజా ప్రతినిధులు, కార్యకర్తలు, మహిళలు, విద్యార్థులు, వృద్ధులు పాల్గొని ఈ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. వెల్దండ మండల ప్రజలు కాంగ్రెస్ పార్టీ యందు విధేయతులమై ఉంటామని, వచ్చే స్థానిక సంస్థ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ జెండా రెపరెపలాడుతుందని కాంగ్రెస్ పార్టీ ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు తెలిపారు. కాంగ్రెస్ కార్యకర్తలు సైనికులై కాంగ్రెస్ పార్టీ విజయం కొరకు కృషి చేయాలని మోతిలాల్ నాయక్ వివరించారు. ఈ కార్యక్రమంలో వెల్దండ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు మోతిలాల్ నాయక్, వెల్దండ మాజీ సర్పంచ్ యెన్నం భూపతిరెడ్డి, సింగల్ విండో డైరెక్టర్ మట్ట వెంకటయ్య గౌడ్, పర్వత్ రెడ్డి, ఎండి రషీద్, మట్ట భరత్, మట్ట మల్లేష్, కొయ్యల పుల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

# జన్మదినోత్సవ వేడుకకు సరికొత్త ఒరవడి - కౌటికె విఠల్ వినూత్న సేవా కార్యక్రమం





**-బసవతారకం క్యాన్సర్ హాస్పిటల్ ప్రాంగణంలో వెయ్యి మందికి భోజన కార్యక్రమం**

హైదరాబాద్, జనవరి 8(నీలగిరి ఎక్స్ ప్రెస్) ప్రఖ్యాత భారతీయ జీవిత బీమా ఏజెంట్ కౌటికె విఠల్ తన పాలసీదారుల పట్ల గౌరవాన్ని చూపిస్తూ, వారి జన్మదినోత్సవాలను ప్రత్యేకమైన సామాజిక కార్యక్రమాలతో జరిపే పద్ధతిని అలవాటు చేసుకున్నారు. ఈ రోజు, తన సమీప పాలసీదారులలో ఒకరైన చందా శ్రీనివాసరావు జన్మదినోత్సవాన్ని 1000 మందికి సహపంక్తి భోజనాల నిర్వహణతో ఘనంగా జరిపారు. హైదరాబాద్ బంజారాహిల్స్‌లోని బసవతారకం క్యాన్సర్ హాస్పిటల్ ప్రాంగణంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న రోగులు, వారి సహాయకులు మరియు స్థానిక భోజనార్థులు పాల్గొన్నారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న చందా నరసింహారావు రిబ్బన్ కట్ చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం జన్మదినోత్సవ కర్త చందా శ్రీనివాసరావు కేక్ కట్ చేసి, అందరి శుభాకాంక్షలను స్వీకరించారు. కేకును మొదటగా నరసింహారావు శ్రీనివాసరావుకు తినిపించారు. ముఖ్య అతిథి నరసింహారావు మాట్లాడుతూ, "ఇలాంటి స్ఫూర్తిదాయకమైన కార్యక్రమాలు సమాజానికి పెద్ద ఉపయుక్తం. ఆకలితో ఉన్న వారికి భోజనం అందించడం గొప్ప దాతృత్వానికి ఉదాహరణ" అని అన్నారు. చందా చిన్న శ్రీనివాస్ మాట్లాడుతూ, "విఠల్ నిర్వహించే ప్రతి కార్యక్రమం ప్రత్యేకతతో అందరి మనసులు గెలుచుకుంటోంది" అని అభిప్రాయపడ్డారు. చందా శ్రీనివాసరావు మాట్లాడుతూ, "కౌటికె విఠల్ పాలసీదారుల పట్ల చూపించే ప్రేమ, ఆప్యాయత నాకు ఎంతో ఆదర్శప్రాయంగా ఉంది. ఈ కార్యక్రమం ఒక పండుగలా, ఒక యజ్ఞంలా సాగింది. మాకు మాత్రమే కాదు, సమాజానికి కూడా ఇది ఉపయోగకరంగా నిలిచింది" అని అన్నారు. కౌటికె విఠల్ మాట్లాడుతూ, "జన్మదినోత్సవం సందర్భంగా పాలసీదారుల పేరుతో భోజన కార్యక్రమం నాకు గర్వకారణం. 1000 మందికి భోజనం అందించడం ద్వారా వారి దీవెనలు పొందడం అనేది అన్ని బహుమతుల కంటే గొప్పది. ఈ దీవెనలు నా పాలసీదారులు 100 సంవత్సరాలు ఆయురారోగ్యాలతో జీవించడానికి ప్రేరణగా ఉంటాయని నేను నమ్ముతున్నాను" అని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కౌటికె ఆదిత్య, ప్రపంచ ఆర్యవైశ్య మహాసభ సీనియర్ సిటిజన్ ఫోరం ప్రధాన కార్యదర్శి పివి రమణయ్య, ఆవోపా హైదరాబాద్ ప్రధాన కార్యదర్శి అడ్వకేట్ రవి గుప్తా పాల్గొన్నారు. భోజన కార్యక్రమం ఆహార దాతృత్వం ద్వారా సమాజానికి సేవ చేయడం ఈ కార్యక్రమానికి ప్రధాన ఆకర్షణగా నిలిచింది. బంజారాహిల్స్ పోలీసుల పర్యవేక్షణలో ఎలాంటి అవాంతరాలు లేకుండా ఈ కార్యక్రమం విజయవంతంగా పూర్తయింది. ఈ విధంగా, కౌటికె విఠల్ తన వినూత్న ఆలోచనలతో ఒక కొత్త ఆదర్శాన్ని నెలకొల్పారు. భోజనం చేసిన ప్రతి ఒక్కరూ ఈ కార్యక్రమం పట్ల ప్రశంసలు కురిపించారు. సమాజానికి చేయూత ఇచ్చే ఈ విధమైన సేవా కార్యక్రమాలు మరెంతో మందికి స్ఫూర్తిగా నిలుస్తాయని అతిథులు పేర్కొన్నారు.

# నూతన సంవత్సర క్యాలెండర్లను ఆవిష్కరించిన మాజీ ఎమ్మెల్యే వై. అంజయ్య యాదవ్



షాద్ నగర్, జనవరి 8(నీలగిరి ఎక్స్ ప్రెస్) షాద్ నగర్ మున్సిపల్ చైర్మన్ కొందూటి నరేందర్, 25వ వార్డు కౌన్సిలర్ మాధురినందకిషోర్ ముద్రించిన నూతన సంవత్సర క్యాలెండర్లను మాజీ ఎమ్మెల్యే అంజయ్య యాదవ్ ఆవిష్కరించారు. ఈ నూతన సంవత్సరంలో ప్రజలందరూ సుఖ సంతోషాలతో ఉండాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ ఎం. ఎస్ నటరాజ్, కౌన్సిలర్ రెటికల్ నందీశ్వర్, నాయకులు నక్కల వెంకటేష్ గౌడ్, గుండు అశోక్, సందీప్, రాధాకృష్ణ ఏం సాని శ్రీనివాస్ , మధుసూదన్ శ్రీకాంత్, సిద్దు, కట్ట పుల్లయ్య , అశోక్ తదితరులు పాల్గొన్నారు.

# కసిరెడ్డి నారాయణరెడ్డిని గజమాలతో సన్మానించిన రాచూర్ కాంగ్రెస్ నాయకులు




వెల్దండ, జనవరి 8(నీలగిరి ఎక్స్ ప్రెస్) వెల్దండ మండలం నుండి రాచూర్ గ్రామాలకు బీటీ రోడ్డు నిర్మాణం కోసం రూ. 5.20 కోట్ల నిధులు మంజూరు చేసిన సందర్భంగా, హైదరాబాద్ లోని నివాసంలో ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు. అనంతరం గజమాలతో సన్మానించి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, ఎన్నికల్లో ఇచ్చిన ప్రతి హామీని నెరవేరుస్తామని, రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి సహకారంతో నియోజకవర్గ అభివృద్ధికి మరింత కృషి చేస్తానని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో రాజు, గ్రామస్తులు రమేష్ ముదిరాజ్, శ్రీనివాసులు ముదిరాజ్, బాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

# చెదురుపల్లి నుండి బుగ్గ కాలువ వరకు బీటీ రోడ్డు నిర్మించాలని ఎమ్మెల్యే కు విజ్ఞప్తి



వెల్దండ, జనవరి 8(నీలగిరి ఎక్స్ ప్రెస్) వెల్దండ మండల కేంద్రంలోని చెదురుపల్లి గ్రామానికి చెందిన యువ నాయకుడు పోలే అశోక్ విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ, చెదురుపల్లి నుండి బుగ్గ కాల్వ తండా వరకు బీటీ రోడ్డు మంజూరు చేయాలని స్థానిక ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డిని కోరారు. మండలంలోని అన్ని గ్రామాలకు రోడ్లు మంజూరు చేయించినట్లు ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డిని అభినందిస్తూ, చెదురుపల్లి గ్రామాన్ని దృష్టిలో ఉంచుకొని బుగ్గ కాల్వ తండా వరకు బీటీ రోడ్ మంజూరు చేయాలని అన్నారు. తండా నుండి రైతులు, ప్రజలు ప్రతినిత్యం పనిని నిమిత్తం వెల్దండకు వెళ్ళవలసి వస్తుందని, బస్సు సౌకర్యం కూడా లేకపోవడంతో రైతులు మరియు ప్రజలు చాలా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. చెదురుపల్లి నుండి తండా వరకు మూడు నాలుగు వందల ఎకరాల పొలాలు ఉండటంతో రైతులకు ప్రయాణం చేయడం కష్టమవుతున్నదని, ఈ రోడ్డుతో ఎర్రబెల్లి, గోకారం గ్రామాల ప్రజలు రాకపోకలు సాగించగలరని చెప్పారు. తండాకు వెళ్లే రోడ్డు మార్గం గుంతల మయంగా ఉండటం వల్ల ప్రజలు, బైకులు, ఆటోలు వెళ్ళడానికి ఇబ్బందులు పడుతున్నారని, బీటీ రోడ్డు మంజూరు చేయాలని అశోక్ కోరారు.

# సంక్రాంతి పండుగ సందర్భంగా పతంగుల ఎగురవేతకు జాగ్రత్తలు

షాద్ నగర్ విద్యుత్ వినియోగ దారులందరికీ టీజీఎస్పీడిసిఎల్ విజ్ఞప్తి



షాద్ నగర్, జనవరి 8(నీలగిరి ఎక్స్ ప్రెస్)
పతంగుల ఎగురవేత సందర్భంగా కరెంట్ వైర్లు, ట్రాన్స్‌ఫార్మర్ల సమీపంలో పతంగులు ఎగురవేయద్దని టీజీఎస్పీడిసిఎల్ విజ్ఞప్తి చేస్తోంది. విద్యుత్ ప్రమాదాలను నివారించేందుకు పతంగులు ఎగరవేసేటప్పుడు జాగ్రత్తలు పాటించాలని కోరుతోంది. పతంగులు ఎగరవేయేటప్పుడు పాటించాల్సిన జాగ్రత్తలను టీజీఎస్పీడిసిఎల్ వివరించింది. బహిరంగ ప్రదేశాలు, మైదానాల్లో మాత్రమే పతంగులు ఎగురవేయాలని, విద్యుత్ లైన్ల వద్ద, ట్రాన్స్‌ఫార్మర్లు, సబ్ స్టేషన్ల వద్ద కైట్స్ ఎగురవేయడం ప్రమాదకరమని సూచించింది. కాటన్ మాంజాలను మాత్రమే, గ్లాస్ కోటింగ్ లేనివి మాత్రమే వాడాలని, నైలాన్, సింథటిక్ మాంజాలను వాడకూడదని తెలిపింది. మెటాలిక్ మాంజాలకు కరెంట్ పాస్ అవుతుందని, అవి విద్యుత్ లైన్లపై పడితే కరెంట్ షాక్ కొట్టే ప్రమాదం ఉందని హెచ్చరించింది. పొడి వాతావరణంలో మాత్రమే పతంగులు ఎగురవేయాలని, తేమ వాతావరణంలో విద్యుత్ ప్రమాదాలు జరిగే అవకాశం ఎక్కువని వివరించింది. పతంగులు, మాంజాలు విద్యుత్ లైన్లపై పడ్డప్పుడు వాటిని వదిలేయాలని, లాగితే కరెంట్ తీగలు ఒకదానికొకటి తగిలి ప్రమాదం జరగవచ్చని తెలిపింది. బాల్కనీ, గోడల మీద నుంచి పతంగులు ఎగురవేయరాదని, కింద పడిపోయే ప్రమాదం ఉంటుందని హెచ్చరించింది. పతంగులు ఎగురవేసేటప్పుడు పేరెంట్స్ తమ పిల్లలను గమనిస్తూ ఉండాలని టీజీఎస్పిడిసిఎల్ విజ్ఞప్తి చేసింది. ఈ సంక్రాంతి పండుగను సురక్షితంగా జరుపుకోవాలని విద్యుత్ శాఖ కోరుతోంది.

## నూతన సంవత్సర టిపిటిఎఫ్ 2025 డైరీని ఆవిష్కరించిన జిల్లా విద్యాశాఖ అధికారి రోహిణి...




హైదరాబాద్, జనవరి 8(నీలగిరి ఎక్స్ ప్రెస్):
టిపిటిఎఫ్ హైదరాబాద్ జిల్లా శాఖ పక్షాన టిపిటిఎఫ్ రాష్ట్ర నాయకులు ముత్యాల రవీందర్, హైదరాబాద్ జిల్లా అధ్యక్షుడు వెంకటేశ్వర ప్రసాద్, ప్రధాన కార్యదర్శి రాంబాబు, రాష్ట్ర కౌన్సిలర్ రామానందయ్య హైదరాబాద్ జిల్లా డీఈవో రోహిణి మరియు మండల పర్యవేక్షకాధికారి విశ్వనాథ్ గుప్త ని కలిసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా హైదరాబాద్ జిల్లా డీఈవో శ్రీమతి రోహిణి 2025 టిపిటిఎఫ్ డైరీ, వాల్ క్యాలెండర్, టేబుల్ క్యాలెండర్ లను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో టిపిటిఎఫ్ జిల్లా ఉపాధ్యక్షులు, సీతారామశాస్త్రి, వెంకటేశ్వర రెడ్డి, కార్యదర్శులు సోమిరెడ్డి, అందేకర్ రవి మరియు కౌన్సిలర్ ఆండాళ్ లు పాల్గొన్నారు.

## వ్యవసాయ కమిషన్ చైర్మన్, సభ్యులకి సత్కారం





నిర్మల్, జనవరి 8(నీలగిరి ఎక్స్ ప్రెస్)
నిర్మల్ జిల్లా సోన్ మండలం పరిధిలోని పోచంపాడు గ్రామంలో తొమ్మిదో తారీకు జరగబోయే పసుపు రైతులతో ముఖాముఖి కార్యక్రమంలో పాల్గొనడానికి రాష్ట్ర వ్యవసాయ కమిషన్ చైర్మన్ కోదండ రెడ్డి విచ్చేశారు. ఈ సందర్భంగా పోచంపాడు గెస్ట్ హౌస్‌లో రాష్ట్ర వ్యవసాయ కమిషన్ సభ్యులు రామ్ రెడ్డి, గోపాల్ రెడ్డి, గడుగు గంగాధర్, కెవిన్ రెడ్డికి నిజాంబాద్ జిల్లా డిహెచ్ఎస్ఓ నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలుపుతూ శాలువాతో ఘనంగా సన్మానించారు. కెవిన్ రెడ్డి మాట్లాడుతూ, రాష్ట్రంలో ప్రజా పాలన వచ్చిన సందర్భంగా ప్రజల వద్దకు పాలన జరుగుతుందని, గత ప్రభుత్వం కమిషన్ల పాలనను కప్పిపుచ్చుకోవడానికే విమర్శలు చేస్తున్నారని అన్నారు. భారతదేశం అభివృద్ధి పథంలో నడవాలంటే రైతు వెన్నెముకగా ఉండాలని, రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి రైతు సమస్యల గురించి నిత్యము ప్రణాళికలు అనుసరించి రైతులను ప్రగతి పథంలో నడిపించాలన్నదే ఆయన అభిమతమని కెవిన్ రెడ్డి కొనియాడారు.

# అస్సాం బొగ్గుగనిలో చిక్కుకున్న 15 మంది కార్మికులు

–గని నుంచి ఒకరి మృతదేహం వెలికితీత



న్యూఢిల్లీ, జనవరి 8(నీలగిరి ఎక్స్ ప్రెస్)
అస్సాంలోని డిమా హసావోలోని బొగ్గు గని నుంచి ఓ మృతదేహాన్ని వెలికి తీశారు. రెండు రోజుల క్రితం ఆ గనిలోకి నీరు ప్రవేశించింది. దీంతో దాంట్లో సుమారు 15 మంది కార్మికులు చిక్కుకున్నట్లు కంపెనీ వెల్లడించింది. నీటితో నిండిన గనిలోకి 21 పారా డ్రైవర్లు గాలింపు కోసం వెళ్లారు. గని దిగువ భాగం నుంచి ఓ మృతదేహాన్ని తీసుకువచ్చారు. నేవీ, ఆర్మీ, ఎన్డీఆర్ఎఫ్, ఎస్డీఆర్ఎఫ్ దళాలు రెస్క్యూ ఆపరేషన్ కొనసాగిస్తున్నాయి. విశాఖపట్టణంకు చెందిన డైవర్లు అక్కడకు చేరుకున్నారు. ఆపరేషన్‌కు ముందు రెక్కీ నిర్వహించి ఆ తర్వాత క్వారీలోకి ఎంటరయ్యారు. గని నుంచి నీటిని తొవ్వేందుకు ఎస్డీఆర్ఎఫ్ డీవాటర్ పంపులను తీసుకువస్తోంది. కుంభీగ్రామ్ నుంచి కూడా ఎంఐ17 హెలికాప్టర్ ద్వారా ఓఎన్జీసీ వాటర్ పైపులను తీసుకువస్తున్నారు. కేంద్ర గనుల శాఖ మంత్రి జీ కిషన్ రెడ్డితో మాట్లాడినట్లు సీఎం హిమంత బిశ్వ శర్మ తెలిపారు. కోల్ ఇండియాకు చెందిన సిబ్బంది.. రెస్క్యూ ఆపరేషన్‌కు రానున్నట్లు మంత్రి తెలిపారు. క్వారీలో నీరు వంద ఫీట్లకు చేరుకున్నది. సుమారు 340 ఫీట్ల లోతులో ఉన్న క్వారీలో కార్మికులు చిక్కుకున్నట్లు తెలుస్తోంది. కార్మికుల పేర్లను కూడా రిలీజ్ చేశారు. అక్రమ రీతిలో గని నిర్వహిస్తున్నట్లు గుర్తించామని సీఎం హిమంత బిశ్వ శర్మ తెలిపారు. ఈ కేసులో ఓ వ్యక్తిని అరెస్టు చేసినట్లు పోలీసులు చెప్పారు. ఉమ్రాంగ్సో పోలీసు స్టేషన్‌లో కేసు నమోదు చేశారు. ఎన్డీఆర్ఎఫ్ ఫస్ట్ బెటాలియన్ కమాండెంట్ హెచ్పీఎస్ ఖాన్‌దారి మాట్లాడుతూ.. నిన్న చాలాసార్లు కార్మికులను చేరుకునేందుకు ప్రయత్నించామని, కానీ తమ ప్రయత్నాలు ఫలించలేదన్నారు. జాయింట్ టీమ్ ఇవాళ గనిలోకి డైవ్‌చేసిందని, వాళ్లు ఓ బాడీని రికవరీ చేసినట్లు చెప్పారు. గనుల్లో డైవింగ్ చేయడం సులువైన అంశం కాదని, రాట్ హోల్స్ ఉన్నాయని, వాటి ఆధారంగా గాలింపు ఉంటుందని ఆయన తెలిపారు

# అమెరికాలో మరోమారు కార్చిచ్చు

–లాస్ ఏంజిల్స్‌లో వేల ఎకరాలు దగ్ధం
–సురక్షిత ప్రాంతాలకు 30వేలమంది తరలింపు



న్యూయార్క్,జనవరి 8(నీలగిరి ఎక్స్ ప్రెస్)
అమెరికాలో కుబేరులకు ఆవాసాలైన మూడు నగరాల్లో లాస్ ఏంజెలెస్ ఒకటి. ఇప్పుడు ఆ సిటీలోని అత్యంత ఖరీదైన ప్రదేశాన్ని కార్చిచ్చు చుట్టుముట్టింది. దీంతో వేలాది ఎకరాల్లోని విలాసవంతమైన ఇళ్లు అగ్నికి ఆహుతి అవుతున్నాయి. ఇక్కడ సంపన్నవర్గాలు నివసించే ది పాలిసాడ్స్ ప్రాంతంలో కార్చిచ్చు చెలరేగింది. దాదాపు 3000 ఎకరాలు దగ్ధమయ్యాయి. దీంతో 30,000 మందిని సురక్షిత ప్రాంతాలకు తరలించారు. చాలామంది తమ సామగ్రి, వాహనాలను అక్కడే వదిలేసి ప్రాణాలు కాపాడుకోవడానికి తరలివెళ్లారు. వీధుల్లో పొగ కమ్మేసింది. మరోవైపు ఒక్కసారిగా ప్రజలు రోడ్ల పైకి రావడంతో చాలాచోట్ల ట్రాఫిక్ జామ్ ఏర్పడింది. ఇక్కడ కొండలపై ఉన్న రహదారులు ఇరుగ్గా ఉంటాయి. దీనికితోడు గాలులు ఎక్కువగా వీయడంతో మంటలు తొందరగా వ్యాపిస్తున్నాయి. రాత్రి వేళల్లో ఇక్కడ గంటకు 100 మైళ్ల వేగంతో గాలులు వీచే అవకాశం ఉందని వాతావరణ శాఖ వెల్లడించింది. కాలిఫోర్నియా గవర్నర్ గవిన్ న్యూసమ్ స్పందిస్తూ.. 'చాలా నిర్మాణాలు కాలిపోయాయి. మరికొన్నిచోట్ల కూడా కార్చిచ్చులు పుట్టొచ్చని అగ్నిమాపక శాఖ అధికారులు అంచనా వేస్తున్నారు' అని తెలిపారు. ఇప్పటివరకు మొత్తం 13,000 నిర్మాణాలకు కార్చిచ్చు ముప్పున్నట్లు లాస్ ఏంజెలెస్ అగ్నిమాక అధికారి క్రిస్టీన్ క్రాఫ్లీ చెప్పారు. బెవర్లీ హిల్స్, హాలీవుడ్ హిల్స్, మలిబు, శాన్‌ఫెర్నాండో ప్రాంతాలకు కార్చిచ్చు వ్యాపించే ప్రమాదం ఉన్నట్లు అనుమానిస్తున్నారు. ఇప్పటికే ఇక్కడి ్ర÷ర్ అలర్ట్ లెవల్స్‌ను పెంచారు. దాదాపు 62,000 మంది ప్రజలు కొన్ని గంటలుగా విద్యుత్తు లేక ఇబ్బందిపడుతున్నారు. ఇక్కడ మంటలను ఆర్పడానికి విమానాలు, హెలికాప్టర్లు, బుల్డోజర్లను అధికారులు రప్పించారు. హాలీవుడ్ స్టార్లు టామ్ హాంక్స్, రీస్ విథర్స్పూన్, స్పెన్సర్ ప్రాట్, హెడీ మోంటాగ్ వంటి నటుల ఇళ్లు అగ్నికి ఆహుతైనట్లు తెలుస్తోంది. మరికొందరి ఇళ్లు కూడా అగ్నికీలలకు సమీపంలో ఉన్నట్లు తెలుస్తోంది. అధ్యక్షుడు జోబైడెన్ ఇక్కడి కార్చిచ్చుపై స్పందించారు. తరచూ అప్‌డేట్లు తెలుసుకొంటున్నట్లు వెల్లడించారు. అక్కడి ప్రజలకు అవసరమైన అన్నిరకాల సాయాలను శ్వేతసౌధం చేస్తుందన్నారు. స్థానిక అధికారులతో తన బృందం టచ్‌లో ఉన్నట్లు వెల్లడించారు. ఇప్పటికే ్ర÷ర్ మేనేజ్‌మెంట్ అసిస్టెంట్ గ్రాంట్‌ను విడుదల చేసినట్లు పేర్కొన్నారు. అక్కడి ప్రజలు అప్రమత్తంగా ఉండాలని.. స్థానిక అధికారుల సూచనలు పాటించాలని కోరారు.

## కాంగ్రెస్ పార్టీ రాష్ట్రంలో హింసను ప్రేరేపిస్తుంది

– శ్రీరాములు అందెల



మహేశ్వరం, జనవరి 8(నీలగిరి ఎక్స్ ప్రెస్)
తెలంగాణ బిజెపి రాష్ట్ర కార్యాలయం పై కాంగ్రెస్ గుండాల దాడిని తీవ్రంగా ఖండిస్తున్నట్లు బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు, మహేశ్వరం నియోజకవర్గం ఇంచార్జ్ శ్రీరాములు అందెల యాదవ్ గారు ఈరోజు మహేశ్వరం నియోజకవర్గ బీజేపీ కార్యాలయంలో తీవ్ర అగ్రహం వ్యక్తం చేశారు.
ఈ సందర్భంగా శ్రీరాములు గారు మాట్లాడుతూ, పోలీసుల సమక్షంలో మా పార్టీ కార్యాలయం వద్ద ఉన్న మా కార్యకర్తలపై రాళ్లు, కర్రలతో దాడి చేయడం దారుణమని, పోలీసులు ప్రేక్షక పాత్ర పోషించడం ఎంతవరకు సమంజసం అని ప్రశ్నించారు. మా పార్టీ కార్యకర్తల సహనాన్ని చేతకానితనంగా భావించకూడదని, కాంగ్రెస్ వ్యూహాలకు బిజెపి బెదరదని, ఇలాంటి రెచ్చగొట్టే చర్యలు పూనుకుంటే భారతీయ జనతా పార్టీ కూడా దీటుగా తీసుకుంటుందని అన్నారు. భారతీయ జనతా పార్టీ తలుచుకుంటే కాంగ్రెస్ కార్యకర్తలు ఎవరు కూడా రోడ్లపై తిరగలేరని, కానీ మా భారతీయ జనతా పార్టీ ఒక క్రమశిక్షణ కలిగిన పార్టీ అని మేము అలాంటి చర్యలకు ప్రేరేపించబోమని అన్నారు. ఈ దాడికి రేవంత్ రెడ్డి పూర్తి బాధ్యత వహించాలని, రాష్ట్రంలో అనేక సందర్భాల్లో శాంతిభద్రతలు లోపిస్తున్న ఎలాంటి ముందస్తు చర్యలు తీసుకోకుండా రేవంత్ రెడ్డి విఫలమవుతున్నారని, అందుకు రేవంత్ రెడ్డి వెంటనే క్షమాపణ చెప్పాలని, అలాగే దాడి చేసిన యూత్ కాంగ్రెస్ గుండాలపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. నిరసనలు ప్రజాస్వామ్య పద్ధతిలో శాంతియుతంగా ఉండాలని, ఇలా దాడులు చేయడం సరైన పద్ధతి కాదని ఈ సందర్భంగా తెలియజేశారు.

## మృతురాలి కుటుంబానికి ఆర్థిక సహాయం అందజేసిన

–జీఎంపిఎస్ మండల ప్రధాన కార్యదర్శి నల్లబెట్ల రాజు




ఐనవోలు,08జనవరి,జనవరి 8(నీలగిరి ఎక్స్ ప్రెస్)
ఇటీవల అనారోగ్యం కారణంగా మృతి చెందిన మృతురాలి కుటుంబానికి గొర్రెల మేకల పెంపకందార్ల సంఘం ఐనవోలు మండల ప్రధాన కార్యదర్శి నల్లబెట్ల చిన్న రాజు యాదవ్ ఆర్థిక సహాయం అందజేశారు. ఐనవోలు మండల కేంద్రానికి చెందిన కత్తుల నాగలక్ష్మి ఇటీవల అకాల మరణం చెందగా బుధవారం ఏర్పాటు చేసిన దశదినకర్మకు గొర్రెల మేకల పెంపకం దార్ల సంఘం మండల ప్రధాన కార్యదర్శి నల్లబెట్ల చిన్న రాజు హాజరై యాదవ్ నాగలక్ష్మి కూతురును పరామర్శించి తన ప్రగాఢ సానుభూతి సంతాపం తెలిపారు. అనంతరం ఆయన మాట్లాడుతూ గత కొన్ని ఏళ్ల కింద అకాల మరణం చెందగా ఆమె కూతురును అంజలి పసిగుడ్డుగా ఉన్న సమయంలో ఇంటికి తీసుకువచ్చి నాగలక్ష్మి అన్ని రకాలుగా బాగోగులు చూసుకుందని తెలిపారు. నేడు ఆమె కూడా మరణించడంతో అంజలి అనాధగా మారిపోయిందన్న విషయం తెలుసుకొని చలించి తనవంతుగా ఆర్థిక సహాయం అందజేశారు. ఈ కార్యక్రమంలో మృతురాలి కుమారులు కత్తుల బిక్షపతి,వీరస్వామి,కుల పెద్దలు నక్క కొమురయ్య,సంగం శ్రీనివాస్,నరిగ రాజేష్, కత్తుల రాజమల్లు,నల్లబెట్ల రాజు,తదితరులు పాల్గొన్నారు.



# మళ్లీ తెలంగాణ నేపథ్యంలో రాబోతున్న సాయి పల్లవి

తెలంగాణ సంస్కృతి, బంధాలు, భావోద్వేగాల నడుమ సాగే బలమైన కథతో 'బలగం' తీసి, భారీ హిట్‌ను అందుకున్న దర్శకుడు వేణు యెల్దండి.. త్వరలో 'ఎల్లమ్మ' కథతో రానున్నారు. దిల్‌రాజు అత్యంత ప్రతిష్టాత్మకంగా ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. నితిన్ కథానాయకుడు. కథానాయికగా సాయిపల్లవి దాదాపు ఖరారైనట్లు తెలుస్తున్నది. ఇటీవలే ఆమె కథ కూడా విన్నదట. 'బలగం' కథను మించిన ఎమోషన్స్ 'ఎల్లమ్మ'లో ఉంటాయని తెలుస్తున్నది. తెలంగాణ సంస్కృతిలో గ్రామ దేవతల ఆరాధన ఎక్కువగా కనిపిస్తుంది. ఇక్కడ ఎల్లమ్మ, పెద్దమ్మ, మైసమ్మ, పోశమ్మ.. ఇలా విభిన్నమైన నామాలతో గ్రామదేవతలు దర్శనమిస్తారు. అలాగే ఆంధ్రప్రదేశ్‌లోనూ గంగానమ్మ, పోలేరమ్మ, అంకాళమ్మ.. ఇలా రకరకాల రూపాల్లో గ్రామదేవతలు పూజలందుకుంటున్నారు. ఈ గ్రామదేవతల నేపథ్యాన్ని తీసుకొని, వారిచుట్టూ తెలంగాణ నేపథ్యంలో దర్శకుడు వేణు యల్దండి ఈ కథ అల్లారని వినికిడి. అయితే.. ఇదేం భక్తిరసచిత్రం కాదు. 'బలగం'లా ఇదికూడా భావోద్వేగాల ప్రయాణమే. సాయిపల్లవి ఓ సినిమా ఒప్పుకుందంటే కచ్చితంగా అది గొప్పదై ఉంటుందనేది పలువురి అభిప్రాయం. మరి 'ఎల్లమ్మ' కథ ఎలా ఉంటుందో చూడాలి. ప్రస్తుతం స్క్రిప్ట్ పనుల్లో 'ఎల్లమ్మ' టీమ్ బిజీగా ఉంది. ఫిబ్రవరి నుంచి రెగ్యులర్ షూటింగ్ మొదలు పెట్టనున్నారట. ఈ చిత్రానికి సాయిమాధవ్ బుర్రా సంభాషణలు అందిస్తున్నారు.



# రజినీ కూలీ సినిమా వాయిదా

## -కారణం ఏంటో తెలుసా..?

తమిళ సూపర్ స్టార్ రజినీకాంత్ ప్రస్తుతం కూలీ సినిమా షూటింగ్‌తో బిజీగా ఉన్నాడని తెలిసిందే. లోకేశ్ కనగరాజ్ దర్శకత్వం వహిస్తున్నాడు. తలైవా నెక్స్ట్ షూటింగ్ షెడ్యూల్ కోసం థాయ్‌లాండ్‌కు కూడా పయనమయ్యాడు. కూలీ 70 శాతం షూటింగ్ పూర్తయిందని.. నెక్స్ట్ షెడ్యూల్ జనవరి 13 నుంచి జనవరి 28 వరకు కొనసాగుతుందని కూడా చెప్పాడు. కూలీ చిత్రాన్ని 2025 మే 1న ప్రపంచవ్యాప్తంగా గ్రాండ్‌గా విడుదల చేయనున్నట్టు మేకర్స్ ఇప్పటికే ప్రకటించారు. అయితే కూలీ అనుకున్న సమయానికి రావడం లేదన్న వార్త ఒకటి తెరపైకి వచ్చింది. ఈ మూవీని ఆగస్టు 14న విడుదల చేస్తున్నారంటూ ఓ అప్‌డేట్ ఫిలింనగర్ సర్కిల్‌లో రౌండప్ చేస్తోంది. ఇదే నిజమైతే ఇంతకీ కారణమై ఉంటుందనేది తెలియాల్సి ఉంది. మరి దీనిపై మేకర్స్ ఏదైనా స్పష్టత ఇస్తారేమో చూడాలి. మరోవైపు జూనియర్ ఎన్టీఆర్, హృతిక్ రోషన్ వార్ 2 కూడా ఇదే రోజు విడుదల చేసేందుకు ప్లాన్ చేస్తున్నట్టు బీటౌన్ సర్కిల్ సమాచారం. లోకేశ్ కనగరాజ్ టీం ఇటీవల రాజస్థాన్‌లోని జైపూర్ షూట్ షెడ్యూల్‌లో భాగంగా సంబార్ లేక్ ప్రాంతంలో అమీర్ ఖాన్, ఉపేంద్ర, తలైవా, రెబా మోనికా జాన్ అండ్ టీంపై వచ్చే సన్నివేశాలను చిత్రీకరించారిన తెలిసిందే. గోల్డ్ అక్రమ రవాణా నేపథ్యంలో వస్తోన్న ఈ చిత్రంలో సత్యరాజ్, మహేంద్రన్, అక్కినేని నాగార్జున, మంజుమ్మెల్ బాయ్స్ ఫేం సౌబిన్ షాహిర్ కీలక పాత్రలు పోషిస్తున్నారు. ఈ మూవీని సన్ పిక్చర్స్ బ్యానర్‌పై కళానిధి మారన్ తెరకెక్కిస్తుండగా.. అనిరుధ్ రవిచందర్ మ్యూజిక్, బ్యాక్ గ్రౌండ్ స్కోర్ అందిస్తున్నాడు.

# బెల్లంకొండ శ్రీనివాస్ సాహస గాథ

## సెగలు పుట్టిస్తోన్న హైందవ టైటిల్ అనౌన్స్‌మెంట్ వీడియో..

టాలీవుడ్ యాక్టర్ బెల్లంకొండ సాయి శ్రీనివాస్ బ్యాక్ టు బ్యాక్ సినిమాలతో బిజీగా ఉన్నాడని తెలిసిందే. ఈ యంగ్ యాక్టర్ నటిస్తోన్న ప్రాజెక్టుల్లో ఒకటి లుధీర్ బైరెడ్డి దర్శకత్వం వహిస్తున్న ఈ మూవీ మిస్టిక్ థ్రిల్లర్‌గా వస్తుంది. ఇటీవలే బెల్లంకొండ కొండపైన అటవీ ప్రాంతంలో గాలులు, మంటల మధ్య రైడ్ చేయడానికి సిద్ధంగా ఉన్న లుక్ ఒకటి విడుదల చేయగా సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది.తాజాగా టైటిల్ అనౌన్స్‌మెంట్ వీడియోనువ విడుదల చేశారు. కొండలు, అటవీ ప్రాంతం విజువల్స్‌తో మొదలైంది ట్రైలర్. ఓ వైపు ఆలయంపై ఇంధనం చల్లుతున్న సన్నివేశాలు, గర్జిస్తున్న సింహం.. మరోవైపు బెల్లంకొండ బైక్‌పై వాటిని నియంత్రించేందుకు వస్తున్న విజువల్స్‌తో గూస్‌బంప్స్ తెప్పించేలా సాగుతూ సినిమాపై క్యూరియాసిటీ పెంచేస్తుంది. దైవత్వంలో పాతుకుపోయిన, సాహసంతో కూడిన కథ అంటూ విడుదల చేసిన వీడియో నెట్టింటిని షేక్ చేస్తోంది. ఈ చిత్రానికి లియోన్ జేమ్స్ సంగీతం, బ్యాక్ గ్రౌండ్ మెయిన్ హైలెట్‌గా నిలువబోతున్నట్టు విజువల్స్ చెప్పకనే చెబుతున్నాయి.ఈ మూవీలో భీమ్లానాయక్ ఫేం సంయుక్తా మీనన్ ఫీ మేల్ లీడ్ రోల్‌లో నటిస్తుండగా..ఇప్పటికే లాంచ్ చేసిన సంయుక్తా మీనన్ స్టైలిష్, ట్రెండీ లుక్ నెట్టింట వైరల్ అవుతోంది. సంయుక్తా మీనన్ ఇందులో సమీర పాత్రలో నటిస్తోంది. ఈ మూవీకి దాశరథి శివేంద్ర సినిమాటోగ్రఫర్‌గా పనిచేస్తున్నాడు.







# ఆ సన్నివేశాలను తొలగించండి

## కోర్టును ఆశ్రయించిన రమ్య

అభిమన్యు సినిమాతో తెలుగు ప్రేక్షకులకు పరిచయమైంది కన్నడ భామ రమ్య. ఈ మాజీ మైసూరు ఎంపీ తాజాగా కోర్టును ఆశ్రయించింది. 2023లో రిలీజైన కన్నడ కామెడీ డ్రామా. రమ్య కామియో రోల్‌లో మెరిసింది. అయితే తన అనుమతి లేకుండా ఈ సినిమాలో ఉపయోగించిన సీన్లను తొలగించాలని నిర్మాతలను కోరుతూ బెంగళూరులోని కమర్షియల్ కోర్టు కాంప్లెక్స్‌ను ఆశ్రయించింది. ట్రైలర్‌తోపాటు సినిమాలోని పుటేజీలో కొన్ని సన్నివేశాలను తన ప్రమేయం లేకుండా వాడారని రమ్య ఫిర్యాదులో పేర్కొన్నది. నిర్మాతలు అనుమతి లేకుండా వాడిన తన వీడియోలను తొలగించడమే కాకుండా.. తనకు కోటి నష్టపరిహారం ఇవ్వాలని డిమాండ్ చేసింది. ఈ విషయమై నిర్మాతలకు పలుమార్లు విజ్ఞప్తి చేసిన తన సీన్లు తొలగించడం, ఎలాంటి యాక్షన్ తీసుకోవడం కానీ చేయలేదని రమ్య ఆరోపించింది. సినిమాలోని తన సన్నివేశాలను తొలగిస్తే కేసును వెనక్కి తీసుకుంటానని కూడా రమ్య చెప్పినట్టు ఇండస్ట్రీ సర్కిల్ టాక్. మరి రమ్య వ్యవహారంపై నిర్మాతలు ఎలా స్పందిస్తారనేది తెలియాల్సి ఉంది.